నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 30-5-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 262 | పేజీలు: 4 | వెల: రూ.1/-

కేటీఆర్‌కు శ్రీలంక సదస్సు ఆహ్వానం

హైదరాబాద్,మే29(ఆర్ఎన్ఎ): రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావుకు మరో అంతర్జాతీయ సదస్సు నుంచి ఆహ్వానం అందింది. ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్ శ్రీలంక విభాగం ఆధ్వర్యంలో మే 30న జరిగే సదస్సులో 'కొవిడ్ -19 దక్షిణాసియా భవిష్యత్తు పునర్ రూపకల్పన' అనే అంశంపై ప్రసంగించాల్సిందిగా నిర్వాహకులు మంత్రి కేటీఆర్‌ను కోరారు. ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రపంచంలోనే అతిపెద్ద ఇండస్ట్రీ బాడీ. వందదేశాల్లో 45 లక్షలమంది సభ్యులు ఈ సంస్థకు ఉన్నారు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ వాణిజ్య సంస్థలతోపాటు ఇతర ప్రభుత్వ సంస్థలతో అనేక కార్యక్రమాలు చేపడుతుంది. ఇదిలావుంటే లాక్‌డౌన్‌తో గల్ఫ్‌దేశాల్లో చిక్కుకున్న 83 మంది తెలంగాణ వాసులు మంత్రి కేటీఆర్ చొరవతో గురువారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. కార్మికుల ఆర్థిక దీనస్థితి నేపథ్యంలో కేటీఆర్ ఆదేశాలతో రంగారెడ్డి జిల్లా అధికారులు వీరిని రాజేంద్రనగర్‌లోని క్వారంటైన్ కేంద్రానికి తరలించారు.

కాళేశ్వరంలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతం

కొండపోచమ్మ ఆలయం వద్ద నిర్వహించిన చండీయాగంలో పాల్గొన్న సిఎం కేసీఆర్ దంపతులు

భార్యతో కలసి పూజలు నిర్వహించిన సిఎం కేసీఆర్

కొండపోచమ్మ సాగర్‌కు చేరుకున్న గోదారమ్మ
చినజీయన్ స్వామితో కలసి
ప్రారంభించిన సిఎం కేసీఆర్
సముద్ర మట్టానికి 530 మీ.ఎత్తులో కొండపోచమ్మ
ఎత్తిపోతలతో వడివడిగా చేరుకున్న జలాలు

సిద్దిపేట,మే29(ఆర్ఎన్ఎ): కాళేశ్వరం ప్రాజెక్టులో మరో అద్భుతఘట్టం ఆవిష్కృతమైంది. గోదారి పరుగులు పెడుతూ ఎత్తయిన కొండపోచమ్మకు చేరుకుంది. అనుకున్న సమయానికి నీరు చేరేలా ప్రాజెక్టును పూర్తి చేయించిన సిఎం కెసిఆర్ కలను సాకారం చేశారు. ఈ సందర్భంగా మర్కుక్ పంప్‌హౌస్‌లో మోటార్లను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. చినజీయర్‌స్వామితో కలిసి కేసీఆర్ మోటార్లను ప్రారంభించారు. మర్కుక్ పంప్‌హౌస్ నుంచి కొండపోచమ్మసాగర్‌లోకి నీటిని ఎత్తి పోసే మోటర్లను ప్రారంభించారు. స్విచ్చాన్ చేసిన వెంటనే గోదావరి జలాలు కొండపోచమ్మ సాగర్‌లోకి చేరుకున్నాయి. అనంతరం కొండపోచమ్మ కట్టపై గోదావరి నీటికి సీఎం కేసీఆర్ జలహారతి ఇచ్చారు. కొండపోచమ్మ సాగర్÷-కుచేరిన గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో ఐదు జిల్లాల చిరకాల స్వప్నం సాకారం అయ్యింది. సముద్ర మట్టానికి 530 మీ. ఎత్తులో కొండపోచమ్మ రిజర్వాయర్ చేపట్టారు. రెండు పంప్‌హౌజ్‌లున్న ఏకైక రిజర్వాయర్ కొండపోచమ్మ రికార్డ్ సృష్టించనుంది. కొండపోచమ్మ రిజర్వాయర్ సామర్థ్యం 15 టీఎంసీలు. కొండపోచమ్మతో 2.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. అలాగే హైదరాబాద్‌కు కూడా తాగునీరు అందనుంది. అంతకముందు కొండపోచమ్మ ఆలయంలో వైభవంగా చండీయాగం నిర్వహించారు. చండీయాగం, పూర్ణాహుతికి సీఎం కేసీఆర్ హాజరయ్యారు. అనంతరం కొండపోచమ్మ అమ్మవారిని కేసీఆర్ దర్శించుకున్నారు. ఆలయంలో కేసీఆర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకెళ్తున్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చి.. రైతుల ముఖాల్లో సంతోషం నింపే దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారు. గోదావరి, కృష్ణా జలాలను ఒడిసిపట్టి.. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే విధంగా ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు . ఇందులో భాగంగా గోదావరి జలాలను ఒడిసి పట్టేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి.. ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగమైన తుది పంపు హౌజ్ మర్కూక్ ను సీఎం కేసీఆర్ ప్రారంభించడంతో ఇది సాకారమయ్యింది. మెతుకు సీమను సస్యశ్యామలం చేసేందుకు కొండపోచమ్మ సాగర్ ను సీఎం ప్రారంభించి.. గోదావరి జలాలకు హారతి పట్టారు. రైతులకు సాగునీరు అందిస్తున్న కేసీఆర్ పై రాష్ట్ర వ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. కొండపోచమ్మ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు పరవళ్లు తొక్కడంతో స్థానిక రైతాంగాం హర్షం వ్యక్తం చేసింది. కొండపోచమ్మ జలాశయాన్ని శ్రీ త్రిదండి చినజీయర్ స్వామిజీతో కలిసి సీఎం కేసీఆర్ దంపతులు ప్రారంభించగానే వారు ఆనందంతో చిందులు వేశారు. మర్కూక్ పంప్‌హౌస్ నుంచి ఈ రిజర్వాయర్‌లోకి గోదావరి నీటి చేరికతో కాళేశ్వరం ప్రాజెక్టులో అద్భుతఘట్టం ఆవిష్కృతమైంది. కొండపోచమ్మ సాగర్‌కి నీరు చేరికతో అత్యంత ఎత్తుకు గోదావరి జలాలు చేరుకున్నాయి. సీఎం కేసీఆర్, చినజీయర్ స్వామి కలిసి గంగపూజ నిర్వహించి గోదావరి జలాలకు హారతి ఇచ్చారు. చండీ, సుదర్శన హోమాల కలశ జలాలను కొండపోచమ్మ రిజర్వాయర్‌లో కలిపారు. కొండపోచమ్మ సాగర్‌లోకి నీరు చేరికతో ప్రాజెక్టులోని తుది.. 10వ దశ ఎత్తిపోతలు పూర్తి అయ్యాయి. దాదాపు 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా అదేవిధంగా హైదరాబాద్ మహానగర తాగునీటి అవసరాలు తీర్చేలా 15 టీఎంసీల సామర్థ్యంతో కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణం జరిగింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పాములపర్తి వద్ద నిర్మించిన కొండపోచమ్మ రిజర్వాయర్ రాష్ట్రంలోని ఐదు జిల్లాలకు వరప్రదాయినిగా మారనుంది. సిద్దిపేట , సంగారెడ్డి, మెదక్, యదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని సాగు, తాగునీటి అవసరాలను ఈ రిజర్వాయర్ తీర్చనున్నది. ఐదుజిల్లాలో మొత్తం 2,85 ,280 ఎకరాలకు సాగునీరు అందనున్నది. 15.8 కిలోమీటర్లు వలయాకారంలో చేపట్టిన ఈ రిజర్వాయర్ నిర్మాణాన్ని రికార్డు సమయంలో పూర్తిచేశారు. రిజర్వాయర్‌కు మూడు ప్రధాన స్లూయిస్ గేట్లు ఉన్నాయి. సంగారెడ్డి కెనాల్ నుంచి సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు నీటిని పంపిస్తారు. జగదేవ్‌పూర్ కెనాల్ నుంచి యాదాద్రి జిల్లాకు నీటినందించనున్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట వద్ద నిర్మిస్తున్న కేశవపూర్ ద్వారా రిజర్వాయర్ జంటనగరాలకు తాగునీరు అందించనున్నది.

వరంగల్ పట్టణాభివృద్ధికి కృషి: వినయ్ భాస్కర్

వరంగల్,మే29(ఆర్ఎన్ఎ): వరంగల్ పట్టణాభివృద్ధి పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసి నగర వాసులకు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. హన్మకొండ బస్టాండ్ జంక్షన్ అభివృద్ధి పనులను వరంగల్ మున్సిపల్ కమిషనర్ పమేలా సత్పతి, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డిలతో కలిసి భూమి పూజ చేశారు. కోటి 90 లక్షల రూపాయలతో చేపట్టనున్నఈ అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. గతంలో పట్టణంలో వర్షపు నీరు రోడ్ల మీద నిలిచి రహదారులు గుంతలతో నిండి ఇబ్బందికరంగా ఉండేదన్నారు. అలాగే హన్మకొండ పట్టణంలో ఉన్నఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని వినయ్ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో కుడా ప్లానింగ్ ఆఫీసర్ అజిత్ రెడ్డి, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జూన్ 6 వరకు కోర్టులు బంద్



హైదరాబాద్: రాష్ట్రంలో న్యాయవ్యవస్థ లాక్‌డౌన్‌ను హైకోర్టు మరోమారు పొడిగించింది. కరోనా నేపథ్యంలో కోర్టులు, ట్రైబ్యునళ్ల లాక్‌డౌన్‌ను వచ్చే నెల 6వ తేదీవరకు పొడిగించింది. అత్యవసర కేసులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టాలని జిల్లా కోర్టులకు ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో మినహా రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ఆన్‌లైన్‌లో, నేరుగా పిటిషన్ల దాఖలుకు అనుమతించింది. కోర్టుల్లో మాస్కులు, శానిటైజేషన్ వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

మర్కూక్ పంపు హౌజ్ వద్ద సుదర్శన యాగం

గజ్వేల్,మే29(ఆర్ఎన్ఎ): మర్కూక్ పంపు హౌజ్ వద్ద నిర్వహించిన సుదర్శన యాగం పూర్ణాహుతిలో సీఎం కేసీఆర్ దంపతులు, త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ దంపతులు, చినజీయర్ స్వామికి వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, హరీష్‌రావు, నిరంజన్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు. మర్కూక్ పంపుహౌజ్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభియచే ముందు యాగం నిర్వహించారు. తర్వాత కొండపోచమ్మసాగర్ కట్ట వద్ద డెలివరీ సిస్టర్న్ వద్దకు చేరుకున్నారు. అనంతరం డెలివరీ సిస్టర్న్ వద్ద గోదావరి జలాలకు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు వరదరాజుపూర్ లోని రాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 12.40 గంటలకు మర్కూక్ పంపు హౌజ్ వద్దకు చేరుకొని ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారుల సమావేశంలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు

తెలంగాణ రైతాంగానికి త్వరలోనే తీపి కబురు

గజ్వేల్,మే29(ఆర్ఎన్ఎ): తెలంగాణ రైతులకు త్వరలోనే తీపికబురు చెబుతానని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. యావత్ దేశమే అబ్బురపడే వార్త ఒకటి చెప్పబోతున్నానని ఆయన స్పష్టం చేశారు. కొండపోచమ్మ రిజర్వాయర్ ప్రారంభోత్సవం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు.కేసీఆర్ పట్టుబడితే మొండిపట్టు పడుతాడు. రైతులు అద్భుతాలు సృష్టించే రోజులు రాబోతున్నాయి. తక్కువ కాలంలోనే ఆశించిన ప్రగతిని సాధించామన్నారు. ఇరిగేషన్ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. నియంత్రిత సాగు మాత్రమే.. నియంతృత్వ సాగు కాదు అని స్పష్టం చేశారు. నియంత్రిత సాగుకు మద్దతు తెలుపుతూ ఇప్పటికే వేలాది గ్రామాలు తీర్మానం చేశాయి. ముఖ్యమంత్రి బాటే.. మా బాట అని రైతులు తీర్మానాలు చేసిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. దేశానికి మనం ఆదర్శం కావాలి. 530 టీఎంసీల నీళ్లను వాడుకోగలిగే సామర్థ్యాన్ని తెలంగాణ సంతరించుకుంది. మహారాష్ట్రతో ఒప్పందం విషయంలో తెలంగాణ అద్భుతమైన రాజనీతిని ప్రదర్శించి.. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని సీఎం తెలిపారు. తెలంగాణ ఇంజినీర్ల ప్రతిభకు ప్రత్యక్ష తార్కాణం కాళేశ్వరం ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి కొనియాడారు. తెలంగాణ ఇంజినీర్లు ఎంత శక్తిమంతులో, నైపుణ్యవంతులో రుజువు చేసిందని కొనియాడారు. కాళేశ్వరానికి 4,800 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నామని, పేరున్న కంపెనీలన్నీ ఈ ప్రాజెక్టు కోసం పనిచేశాయని పేర్కొన్నారు. దీంతో తెలంగాణకు 165 టీఎంసీల నూతన సామర్థ్యం వచ్చి చేరిందని, తెలంగాణ రైతులకు త్వరలోనే తీపి కబురు కచ్చితంగా చెబుతామని, దేశమే నివ్వెర పోయే మాట చెబుతామని ఆయన వెల్లడించారు. లక్ష కోట్ల రూపాయల పంటను సంవత్సరానికి తెలంగాణ రైతాంగం పండించబోతోందని, దేశంలో 83 లక్షల టన్నుల వరి ధాన్యం సేకరిస్తే... 53 లక్షల టన్నుల కేవలం తెలంగాణ నుంచే వచ్చిందని సాక్షాత్తూ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియానే పేర్కొందని ఆయన తెలిపారు. ఆరేళ్ల కింద అనాథలా ఉన్న తెలంగాణ.. నేడు మాత్రం పసిడి పంటల తెలంగాణగా ఆవిర్భవించిందని హర్షం వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా సరే, ప్రాజెక్టు పూర్తయ్యిందని అన్నారు. 48 డిగ్రీల ఉష్ణోగ్రతలో ప్రాజెక్ట్ కోసం పనిచేసిన..ఇతర రాష్ట్రాల కూలీలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని ఆయన ప్రకటించారు. తెలంగాణ కోసం చావు నోట్లో తలపెట్టి వచ్చానని, అందరి కష్టాల ఫలితమే తెలంగాణ అద్భుతంగా తయారు కావాలని, అందరూ ఆశించిన రీతిలో ఫలితం కళ్లముందు కనిపిస్తోందని కేసీఆర్ ప్రకటించారు. నయాగర జలపాతంలా కొండపోచమ్మ సాగర్ కనిపిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. నాగార్జున సాగర్ కాలువ కంటే కొండ పోచమ్మ సాగర్ కాలువ పెద్దది అని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఇంత పెద్ద కాల్వ ఎక్కడా లేదు. నాగార్జున సాగర్ కాలువ 11 వేల క్యూసెక్కులు ఉంటే.. ఇది 11,500 క్యూసెక్కుల ప్రవాహంతో ఉంది. మల్లన్నసాగర్ నుంచి మర్కూక్ పంపు హౌజ్ వరకు 28 కిలోమీటర్ల దూరం ఉంది. 23 కిలోమీటర్ల వరకు ఒక టీఎంసీ మాత్రమే వస్తుంది. ఆ ఒక టీఎంసీ ఉండే దగ్గ ఈత పడితే.. కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. వచ్చి కొండపోచమ్మ సాగర్‌లో తేలే అవకాశం ఉంది. దీనిపై ప్రజలను, పిల్లలను ఎడ్యుకేట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అక్కడక్కడ ఘాట్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా అధికార యంత్రాంగానికి సూచిం చానని సీఎం తెలిపారు. జిల్లా అధికారులు సూచించిన ప్రాంతాల్లోనే పిల్లలు, పెద్దలు స్నానం చేయాలన్నారు.

నియంత్రిత సాగే తప్ప నియంతృత్వ సాగు కాదు
ఆరేళ్ల కింద అనాథ.. ఇప్పుడు పసిడిపంటల తెలంగాణ
అద్భుతమైన ఇంజనీరింగ్ ప్రతిభకు కాళేశ్వరం నిదర్శనం
కొండపోచమ్మ సాగర్ నిర్వాసితుల త్యాగాలు మరువలేనివి
ప్రాజెక్టు కోసం కృషి చేసిన వారందరికి పాదాభివందనాలు
నయాగరా జలపాతాన్ని తలపిస్తున్న కొండపోచమ్మ సాగర్
తెలంగాణ వ్యవసాయరంగంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం
తెలంగాణ వారికి పాలన చాతగాదని విమర్శించారు
తెలంగాణ ఏర్పాటుతో పాటు ప్రాజెక్టు కలలను సాకారం చేసుకున్నాం
మీడియా సమావేశంలో సిఎం కెసిఆర్

కొండపోచమ్మ సాగర్ ప్రారంభోత్సవం రాష్ట్ర చరిత్రలో ఉజ్వలమైన ఘట్టం. కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు అపూర పమైన ప్రాజెక్టు అని సీఎం పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పదో లిఫ్టు కింద కొండపోచమ్మ సాగర్‌లోకి గోదావరి జలాలు ప్రవేశించాయి. కాళేశ్వరం నుంచి కొండపోచమ్మ వరకు కోల్పోయిన భూనిర్వాసితులకు శిరసు వంచి నమస్కరిస్తున్నా. ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. వారి త్యాగం వల్లే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చాయి. నిర్వాసితుల త్యాగాలు వెలకట్టలేనివి. మంచి నష్ట పరిహారం ఇచ్చాం. అన్ని విధాలా వారికి ప్రభుత్వం అండదండగా ఉంటుంది. భూ నిర్వాసితుల త్యాగాలు గుర్తు చేసుకోకుండా ఉండలేమని సీఎం స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మల్లన్నసాగర్ ప్రాజెక్టు అతి పెద్దది. మల్లన్న సాగర్ ప్రాజెక్టు రాష్ట్రంలో రెండో అతిపెద్ద ప్రాజెక్టు అని సీఎం తెలిపారు. 165 టీఎంసీల కెపాసిటీతో కొత్త రిజర్వాయర్‌లు నిర్మించాం. ఇంత పెద్ద ఎత్తున ప్రాజెక్టులను ఏ రాష్ట్రం కూడా నిర్మించలేదు. మూడు నాలుగేళ్లలోనే ఈ ప్రాజెక్టులను పూర్తి చేశాం. లక్ష కోట్ల రూపాయాల పంటను తెలంగాణ రైతాంగం సంవత్సరానికి పండించబోతుంది అని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రాజెక్టు గురించి రాసిన జర్నలిస్టు మిత్రులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. నిర్వాసితుల త్యాగం వల్ల లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిం ద న్నారు. భూ నిర్వాసితులకు సిద్దిపేట ఎస్ఈజడ్‌లో ఉద్యోగాలు ఇస్తామని కేసీఆర్ పేర్కొన్నారు. నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.రాష్ట్రం వసిడి పంటల తెలంగాణగా మారిందన్నారు. ఇంజినీరింగ్ అద్భుతం కాళేశ్వరం ప్రాజెక్టని, తెలంగాణ ఇంజినీర్ల ప్రతిభకు నిదర్శనమన్నారు. నిర్వాసితుల కోసం కొత్తగా కొత్త గజ్ఎల్‌ను నిర్మిస్తున్నామని అన్నారు. మీడియా సమావేశంలో మంత్రి హరీష్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి,అధికారులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ "శేషేంద్ర శర్మ" కవితా-వి
శేష మ్మై వలచు గాన శేముషి పొదన
శేషేంద్ర శర్మ రూప...వి
శేష మును బాగ దు నాది శేషుని ఆరమే?

(మే 30 గుంటూరు శేషేంద్రశర్మ పుణ్యతిథి..)

-రాధశ్రీ
సెల్: 9494481210



సిఎం కేసీఆర్‌ను అభినందించిన ఓవైసీ

గోదావరి జలాలతో సాగుతాగునీటి సమస్యలు తీరుతాయని ట్వీట్

హైదరాబాద్,మే29(ఆర్ఎన్ఎ): కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ ప్రారంభించిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రాజెక్టును ప్రారంభించిన నేపథ్యంలో కేసీఆర్‌కు అభినందనలు తెలుపుతూ ఓవైసీ ట్విటర్‌లో స్పందించారు. 'కొండపోచమ్మ సాగర్ గొప్ప ముందడుగు. జలాశయం ద్వారా రైతులకు సాగునీరు, గృహాలకు మంచినీరు అందుతాయి.' అని ఎంపీ ట్వీట్ చేశారు. కొండపోచమ్మ జలాశయాన్ని శ్రీ త్రిదండి చినజీయర్ స్వామిజీతో కలిసి సీఎం కేసీఆర్ దంపతులు ప్రారంభించారు. మర్కూక్ పంప్‌హౌస్ నుంచి ఈ రిజర్వాయర్‌లోకి గోదావరి నీరు చేరికతో కాళేశ్వరం ప్రాజెక్టులో అద్భుతఘట్టం ఆవిష్కృతమైంది. కొండపోచమ్మ సాగర్‌కి నీరు చేరికతో అత్యంత ఎత్తుకు గోదావరి జలాలు చేరుకున్నాయి.

నేటినిజం
శనివారం 30-5-2020

కాస్త ఆలోచించడం మంచిదేమో..!

స్వాతంత్ర్యం సిద్ధించిన పిదప పాలకులు స్వావలంబన పేరుతో ప్రధాన వృత్తి అయిన వ్యవసాయం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచి హరిత విప్లవం తేవాలని, అందుకు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, అధునాత యంత్రాలను వ్యవసాయరంగంలో ప్రవేశపెట్టడానికి కృషి చేశారు. ఏది ఏమైనా వ్యవసాయంలో మార్పులు సంభవించిన పిదప రైతన్నకు కూడా కష్టాలు పెరిగాయి తప్పా తగ్గలేదు. వ్యవసాయం చేయాలంటే పెట్టుబడి సమకూర్చుకోవడం ప్రధాన సమస్యగా మారింది. మొదట దుక్కిచేయాలి. విత్తనాలు కొనుగోలు, ఎరువ్వులు, క్రిమిసంహారక మందులు, కూలీలకు డబ్బులివ్వడం ఇవన్నీ అమలు కావాలంటే డబ్బు కావాలి. గతానికి ఇప్పటికీ చాలా మార్పుఉంది. అప్పట్లో ఎడ్లతో వ్యవసాయం, పంట నుండి మెరుగైన విత్తనాలను సమకూర్చుకోవడం, ఎరువులకు బదులుగా ఎడ్ల పేడ, పెంట లాంటివి, కూలీలకు ధాన్యమివ్వడం జరిగేది. సాగునీటి సౌకర్యం లేక మెట్టప్రాంతాల రైతులు బావులు తవ్వుకోవటం జరుగుతుంది. దీనికి గల కారణాలను అన్వేషించడానికి గత కేంద్ర ప్రభుత్వాలు స్వామినాథన్ కమిషన్‌ను, జయతీఘోష్, రామ నారాయణరెడ్డి లాంటి కమిషన్‌లు నియమించారు అట్టి కమిషన్‌లు భూమి పట్టాలు, గిట్టుబాటు ధరలు అన్ని అంశాలపైన రిపోర్టులు ఇచ్చాయి.కాని వాటిని అమలు చేయడానికి కేంద్రంలో ఏ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రయత్నించలేదు. సిద్ధం కాలేదు. ధరల నిర్ణయాల కమిటీలో ఒక రైతుకు స్థానం కల్పించకపోవడం ఆలోచించేదిగా ఉంది. స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం వడ్ల ధర క్వింటాలుకు రూ. 2700లు ఉండాలి. ఇప్పుడున్నది కేవలం రూ. 1835 ఉండటం రైతుకు ఎంత నష్టమో ఆలోచించండి.. జై జవాన్, జై కిసాన్ అంటారు. బార్డరులో సైనికులు దేశరక్షణకు ప్రాణాలను పణంగా పెడుతున్నారు.

దేశానికి అన్నం పెట్టే రైతన్నకు పాలకులు సున్నం పెడుతున్నారు. వ్యవసాయాన్ని సంక్షోభంలోకినెట్టి రైతు ఆత్మహత్య లకు కారణమవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వ అధినేత కెసిఆర్ ఎకరానికి సంవత్సరం పెట్టుబడి సహాయం కింద రూ. 10వేలు రైతుబంధు పథకం పేరుతో ఇస్తున్నారు. రైతుల అప్పులను 2005 లో యుపిఎ ప్రభుత్వం మాఫీ చేయగా, కెసిఆర్ ప్రభుత్వం గత పాలన సమయంలో అప్పులు మాఫీ చేసింది. ఇప్పుడేమో ఒక లక్ష అప్పువరకు నాలుగు విడతలలో చేస్తానని ప్రకటించింది. ైరైతు ఆత్మహత్యకు ప్యాకేజీ, రైతు మరణిస్తే ఇన్సూరెన్స్ ఇవి ప్రధాన నినాదాలుగా చోటు చేసుకోవడం పట్ల ప్రజలలో, మేధావులలో చర్చజరగాలి. భూసార పరీక్షలు నిర్వహించి శాస్త్రీయ కోణం నుండి పంటల మార్పిడిపై రైతులకు సలహాలివ్వడం సమంజసంగా ఉంటుంది.

తెలంగాణ ప్రాంతం ఎత్తు,పల్లాలతో కూడుకున్నది. ఇందులో పంటసాగు ఎక్కువగా ఉంటుంది. నల్లరేగడి నేలలు, ఎర్రమట్టి నేలలు, సౌడు నేలలు,దుబ్బనేలలు రకరకాలుగా ఉంటాయి. నీరు ఎక్కువగా లభించే ప్రాంతంలో వరిపంట పండించుకునేది ఆనవాయితీ సాంప్రదాయంగా వస్తోంది. కరెంట్ మోటర్ల ద్వారా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించే దగ్గర వరి, ఇతర పంటలు వేయడం సహజం. నల్లరేగడి భూములలో వర్షాలు పడగానే రోహిణికార్తెలోనే వర్షాల పైన ఆధారపడే భూముల్లో విధిగా మొక్కజొన్న లేదా వేరుశనగ, పెసర, బొబ్బర్లు లాంటి మూడు మాసాలలోపే చేతికొచ్చే పంటలు వేసుకుంటారు. అలాగే కొంతమంది పత్తి,వరి వేయడం లాంటి పంటలువేయడం ఆనవాయితీగా వస్తున్నది.ఇప్పటివరకు భూసార పరీక్షలు అన్ని భూములపై చేయలేదు. ఎలాంటి నేలలో ఏ పంట వేయాలో శాస్త్రీయంగా నిర్ధారించలేదు. వ్యవసాయ శాస్త్రజ్ఞులు, వ్యవసాయ నిపుణులు పంటలు వేసుకోవాలో తెలియపరిస్తే ఉపయుక్తంగా ఉంటుంది.

ఇక కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తా

హైకోర్టు తీర్పు నేపథ్యంలో నిమ్మగడ్డ స్పందన

హైదరాబాద్,మే29(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా బాధ్యతలు తీసుకుంటున్నానని నిమ్మగడ్డ రమేశ్ కుమార్ ప్రకటించారు. నగరంలోని ప్రశాసన్ నగర్‌లో ఉన్న తన నివాసంలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన... గతంలో మాదిరిగానే నిష్పాక్షికంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని ఆయన అన్నారు. అన్నిరాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకొని.. స్థానిక సంస్థల ఎన్నికల పక్రియను ప్రారంభిస్తామన్నారు. వ్యక్తులు కాదు... రాజ్యాంగ సంస్థలు, విలువలు శాశ్వతమని రమేశ్ పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థ విలువల పరిరక్షణకు కట్టుబడి ఉన్నానని ఆయన అన్నారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసినవారిపై... వ్యవస్థలను కాపాడాల్సిన బాధ్యత ఎక్కువగా ఉంటుందని రమేశ్ అన్నారు.

నిమ్మగడ్డ రమేశ్ కుమార్ తిరిగి ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా కొనసాగుతారని ఏపీ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన నిమ్మగడ్డ ఓ కీలక ప్రకటన చేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణ స్వీకారం చేసిన వారంతా ఆ వ్యవస్థలకు కట్టుబడి వ్యవహరించాలని, సమగ్రతను కాపాడాలని ఆయన చెప్పారు. వ్యక్తులు శాశ్వతంగా ఉండరని, రాజ్యాంగ సంస్థలు, వాటి విలువలు మాత్రమే చిరస్థాయిగా ఉంటాయని పేర్కొన్నారు. ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం తాను మళ్లీ పదవిలోకి వచ్చానని ప్రకటించారు. తాను ఇకపై కూడా గతంలో మాదిరిగానే నిష్పక్షపాతంగా పనిచేస్తానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయ పార్టీలతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తానని, పరిస్థితులన్నీ అనుకూలించాక స్థానిక సంస్థల ఎన్నికల పక్రియ ప్రారంభించాలనుకుంటున్నట్లు వెల్లడించారు.

మాతృభూమి ఎండి వీరేంద్ర కుమార్ మృతి

ప్రధాని మోడీ, వెంకయ్య సంతాపం

తిరువనంతపురం,మే29(ఆర్ఎన్ఎ): కేరళకు చెందిన ప్రముఖ సోషలిస్టు నాయకులలో ఒకరైన రాజ్యసభ ఎంపీ, ప్రముఖ మలయాళ దినపత్రిక మాతృభూమి మేనేజింగ్ డైరెక్టర్ వీరేంద్ర కుమార్ గురువారం కన్నుమూశారు. గత రాత్రి 8.30 గంటలకు కోజికోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కార్డియాక్ అరెస్ట్‌తో ఆయన మరణించారు. వీరేంద్రకుమార్‌కు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈయన రాష్ట్ర, జాతీయ రాజకీయాలలో, మీడియా రంగంలో, సాహితీ ప్రపంచంలో ఇలా ప్రతీ రంగంలోనూ తనదైన ముద్ర వేశారు. లోక్‌సభ సభ్యునిగా కోజికోడ్ నుంచి రెండుసార్లు గెలిచిన వీరేంద్రకుమార్ కేంద్ర, రాష్ట్రాల్లో రెండింటిలోనూ మంత్రిగా పనిచేశారు. 2010లో తన ప్రయాణ కథనం హైమావత భోవిల్‌కు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. వీటితో పాటు తన సాహితీ రచనలకు కేరళ సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు, 100కి పైగా అవార్డులను గెలుచుకున్నారు. కాగా ఆయన మృతికి ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. 'పేదలకు, నిరుపేదల పక్షాన గొంతెత్తారని గుర్తుచేశారు. సమర్థవంతమైన శాసనసభ్యుడిగా, ఎంపీగా ఆయన మంచి గుర్తింపు పొందారంటూ' మోడీ ట్వీట్ చేశారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్ గాంధీ కూడా వీరేంద్ర కుమార్ మృతికి సంతాపం ప్రకటించారు.

మర్కజ్ చీఫ్‌కు అక్రమ మార్గంలో నిధులు

విచారణ చేపట్టిన సిబిఐ

న్యూఢిల్లీ,మే29(ఆర్ఎన్ఎ): తబ్లీగ్ జమాత్ చీఫ్, నిజాముద్దీన్ మర్కజ్‌కు చెందిన మౌలానా సాద్‌కు హవాలా మార్గంలో విదేశాల నుంచి వచ్చిన విరాళాలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దర్యాప్తు కొనసాగిస్తోంది. నిజాముద్దీన్‌లో తబ్లీగ్ జమాత్ సమావేశం నిర్వహించి కరోనా వ్యాప్తికి కారణమైన మౌలానా సాద్ పై ఢిల్లీ క్రైంబ్రాంచ్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అనంతరం హవాలా మార్గంలో మౌలానాకు విదేశాల నుంచి విరాళాలు వచ్చాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేసింది. దీంతో తాజాగా రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు ఢిల్లీ క్రైంబ్రాంచ్ పోలీసులు, ఈడీ, ఐటీ విభాగాల నుంచి మౌలానాకు అందిన విదేశీ విరాళాలపై సమాచారాన్ని సేకరించారు. తబ్లీగ్ జమాత్ విదేశీ విరాళాల వ్యవహారాన్ని పర్యవేక్షిస్తున్న మౌలానా సన్నిహితుడైన మురుసలీన్‌ను మే 16న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారించారు. జమాత్ ట్రస్టుకు విదేశీ విరాళాలు హవాలా మార్గంలో స్వీకరించి మనీలాండరింగ్ కు పాల్పడ్డారని ఈడీ దర్యాప్తులో తేలడంతో సీబీఐ రంగంలోకి దిగి మౌలానా సాద్ పై దర్యాప్తు సాగిస్తోంది. మర్కజ్ ట్రస్ట్‌తోపాటు మౌలానా సాద్‌పై సీబీఐ చర్యలు తీసుకోనుంది. అంతకుముందు మర్కజ్ విరాళాలపై కీలక పత్రాలను ఢిల్లీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా.. మార్చి 13 తరువాత మార్కాజ్ లోపల ఉన్న వేలాది మంది భారతీయులను, విదేశీయులను దేశవ్యాప్తంగా లాక్‌డౌన్‌ను ధిక్కరించడానికి మౌలానా సాద్ ప్రోత్సహించారని ఆరోపణలున్నాయి. కోవిడ్ -19 పాజిటివ్ వచ్చిన 4,300 మంది వ్యక్తులు మం

రాజమౌళి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

హైదరాబాద్, మే29: డెస్క్, ఫొటో, వీడియో జర్నలిస్టులనే తేడాలు లేకుండా అందరినీ సమానంగా చూస్తున్న ప్రభుత్వం దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రమేనని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. అలాగే జర్నలిస్టులకు మొదటిసారి ప్రత్యేక నిధిని పెట్టి, ఆదుకుంటున్న ప్రభుత్వం కూడా ఒక్క కేసీఆర్ దేనని ఆయన అన్నారు. ఈ మధ్యే బ్రెయిన్స్ స్ట్రోక్ తో హఠాన్మరణం పొందిన ఈనాడు పత్రిక సీనియర్ ఫొటో జర్నలిస్టు రాజమౌళి కుటుంబాన్నిమల్కాజిగిరిలోని వారి నివాసానికి వెళ్లి మంత్రి పరామర్శించారు.

రాజమౌళి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రాజమౌళి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. జనం కోసం పాటు పడే జర్నలిస్టులు వారి వ్యక్తిగత జీవితం, సొంత కుటుంబాల గురించి కూడా ఆలోచించాలన్నారు. రాజమౌళి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పారు.

ఇటీవల మరణించిన ఈనాడు ఫోటోగ్రాఫర్ రాజమౌళి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో డ్రోన్ కెమెరాల వినియోగం

-కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, మే 29(నేటినిజం ప్రతినిధి): ప్రస్తుత సడలింపుల నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో వాహనాలు రోడ్లపైకి రావడం, వివిధ ప్రాంతాలలో ట్రాఫిక్ స్థంభించి పోవడం లాంటి చర్యలను గుర్తించి, ట్రాఫిక్ ప్రాంతాల్లో వాహనాలు,ప్రజలు జమకూడి ఉన్నారనే విషయాన్ని సులువుగా గుర్తించేం సామాజికదూరం పాటిస్తున్నారా? బహిరంగ ప్రదేశాల్లోజరిగే అసాంఘీక తోపాటు,పొరపాటున ప్రయాణించిన వాహనాల్లో ఏవైనా వస్తువులను మరచిపోయినట్లయితే పొగొట్టుకున్న వస్తువులను తిరిగి అందజేయడం కోసం కరీంనగర్ కమీషనరేట్‌వ్యాప్తంగా ప్రైవేటు వాహనాలకు

క్రమబద్ధీకరణ చర్యల కోసం డ్రోన్ కెమెరాలను వినియోగించనున్నామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ డ్రోన్‌కెమెరాలను గతంలో వేలాదిమంది విద్యార్థులు వివిధ రకాల పరీక్షలకు హాజరైన, సభలు,సమావేశాల నిర్వాహణ సందర్భంలో డ్రోన్ కెమెరాలను వినియోగించి పోలీస్‌శాఖ సఫలీకృతం అయిన విషయం విదితమే.

డ్రోన్‌కెమెరాల ద్వారా ట్రాఫిక్ పరిస్థితులను అంచనావేస్తూ తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఏఏ దుకు వీలవడంతోపాటు వాహన దారులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వేగవంతంగా చర్యలు తీసుకునేందుకు దోహదపడనున్నాయి. కమిషనరేట్ వ్యాప్తంగా ఈ డ్రోన్‌కెమెరాలను వినియో గించడం జరుగుతుంది. డ్రోన్‌కెమెరాలను కమాండ్ కంట్రోల ట్‌నకు అనుసంధానం చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడూ సమీక్షించడం, ఆయాప్రాంతాలలో విధుల్లో ఉన్న పోలీసులను అప్రమత్తం చేసేందుకు ఈడ్రోన్‌కెమెరాలు ఉపయోగపడనున్నాయి. ప్రజలు ఈవిపత్కర పరిస్థితులలో కార్యకలాపాలను సైతం గుర్తించడం జరుగుంది. ట్రాఫిక్ విధుల్లో డ్రోన్‌కెమెరాల వినియోగానికి ప్రత్యేకబృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

క్యూఆర్‌కోడ్ వినియోగించని వాహనాలకు ఈ-చలాన్‌ద్వారా జరిమానాలు

ప్రజల రక్షణ,భద్రత చర్యల్లో భాగంగా వివిధ రకాల ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించే వివిధ వర్గాల ప్రజల ప్రజలు సురక్షితంగా తమగమ్యస్థానికి చేరుతున్నారా? అనేవిషయాన్ని గుర్తించడం క్యూఆర్‌కోడ్‌ను అమలుచేస్తున్న విషయం విదితమే. క్యూఆర్‌కోడ్‌ను అమలు చేయని వాహనాలకు ఈ-చలాన్ ల ద్వారా జరిమానాలు విధించాలని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కమీషనరేట్‌వ్యాప్తంగా పోలీసు అధికారులను ఆదేశిం చారు.

ఇతర రాష్ట్రాల నుండి వలసవస్తున్న వారిని హెూంక్వారంటైన్ చేయాలి

ప్రస్తుతం నెలకునిఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఉపాధి,ఉద్యోగ అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలకు వలసవెళ్ళిన వారు ప్రస్తుతం అమల్లోఉన్న సడలింపులతో స్వగ్రామాలకు వస్తున్న విషయం విదితమే. ఇతర రాష్ట్రాల నుండి స్వగ్రామాలకు వస్తున్న వారిని గుర్తించి సంబంధిత అధికారుల సహకారంతో ప్రాథమిక వైద్యపరీక్షలు నిర్వహించి హెూంక్వారంటైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. ఇలాంటి చర్యలు తీసుకోవడం ద్వారా విపత్కర పరిస్థితులను నియంత్రించేందుకు అవకాశం ఉందని సూచించారు.

జగన్ ప్రభుత్వంపై టిడిపి అవాకులు చవాకులు-మండిపడ్డ మంత్రి తానేటి వనిత

ఏలూరు,మే29(ఆర్ఎన్ఎ): జగన్ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు చూసి ఓర్వలేక టీడీపీ నేతలు అవాకులు చెవాకులు పేలుతున్నారని మంత్రి తానేటి వనత అన్నారు. జగన్ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు చూసి ఓర్వలేక టీడీపీ నేతలు అవాకులు చెవాకులు పేలుతున్నారని మంత్రి తానేటి వనిత అన్నారు. జూమ్ యాప్ ద్వారా నిర్వహించిన మహానాడుకు టీడీపీ ఎమ్మెల్యేలే అందుబాటులో లేకుండా పోయారని చెప్పారు. మహానాడులో చేసే తీర్మానాలు కాగితాలకే పరిమితం అవుతాయన్నారు. టీడీపీ నేతలు చెప్పేది వినే పరిస్థితిలో ప్రజలు లేరని వ్యాఖ్యాని ంచారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే తాము సంతోషంగా ఉంటామో ప్రజలకు తెలుసు అని వెల్లడించారు. వైఎస్ కంటే జగన్ మరి ంత మంచి పరిపాలన అందిస్తు న్నారన్నారు. కొంతమంది నాయకులు ఎన్నికల సమయంలో ఎవరి ఓట్లు ఎక్కువ పడతాయో దానికి అనుగుణంగానే మ్యానిఫెస్టో తయారు చేస్తారన్నారు. వైసీపీ మాత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాతే మ్యానిఫెస్టో తయారు చేసిందని మంత్రి తెలియజేశారు.

మిడతలదండు దాడీ ప్రకృతి విపత్తే !

హైదరాబాద్, మే 29:ఇప్పుడు దేశాన్ని కొత్తరకం దండు పట్టి పీడిస్తోంది. అదే మిడతల దండు. పంటలను మొత్తంగా మాయం చేసే ఏకైక దండు ఇది. ఈ దండు వాలితే పంటల సంగతి అంతే. ఒక్కరోజులో ఉన్నపంటను మొత్తం నాశనం చేయగల శక్తి వీటికి ఉంది. ఇది కూడా ఓ రకంగా ప్రకృతి విపత్తుగానే భావించాలి. దీని నుంచి రైతులు తమంతతాముగా రక్షించుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం కూడా వెంటనే చర్యలు తీసుకునే అవకాశాలు లేవు. వీటిని నిర్మూలించేందుకు దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలి. అయితే తెలుగు రాష్ట్రాల్లోకి ఈ దండు ప్రవేశించే ప్రమాదం ఉందన్న విషయంతో సిఎం కెసిఆర్ సమగ్రంగానే చర్చించారు. ఎపికి కూడా కొతం మేర దాడికి గురి కావచ్చని అంటున్నారు. రాబోయే రోజుల్లో మిడతలు ఎటువైపు వెళ్లే అవకాశం ఉందనే విషయాన్ని ఆరా తీశారు. రాజస్తాన్ ద్వారా భారతదేశంలోకి ప్రవేశించిన మిడతల దండు ప్రస్తుతం మహారాష్ట్రలోని భండార, గోండియా మీదుగా మధ్యప్రదేశ్ లోని బాలాఘాట్ వైపు వెళ్తున్నట్లు సమాచారం ఉందని అధికారులు చెప్పారు. అక్కడి నుంచి ఉత్తర భారతదేశం వైపు ప్రయాణించి పంజాబ్ వైపు వెళ్లే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నాట్లు అధికారులు భావిస్తున్నారు. గాలివాటం ప్రకారం ప్రయాణించే అలవాటున్న మిడతలదండు, ఒకవేళ గాలి దక్షిణం వైపు మళ్లితే చత్తీస్ ఘడ్ మీదుగా తెలంగాణ వైపు వచ్చే అవకాశాలు కొన్ని ఉన్నాయని అధికారులు స్పష్టం చేశారు. అయితే మిడతలు తెలంగాణలో ప్రవేశించేందుకు తక్కువ అవకాశాలున్నప్పటికీ రాష్ట్రంలోకి అవి ప్రవేశించకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న మిడతల దండును సంహరించేందుకు గోండియా ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయి. అక్కడ కోట్ల సంఖ్యలో మిడతలను చంపగలిగారని అయినా మిగిలిన కొన్ని మిడతలు మధ్యప్రదేశ్ మీదుగా పంజాబ్ వైపు వెళ్లే అవకాశా లున్నట్లు అంచనా వేస్తున్నారు. గాలి మరలి చత్తిష్‌గఢ్ మీదుగా తెలంగాణవైపు కూడా రావచ్చని అధికారులు తెలిపారు. అందుకే మిడతల దండు తెలంగాణ వైపు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, మహారాష్ట్ర, చత్తీస్ గఢ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉండాలని కేసీఆర్ ఆదేశించారు. సరిహద్దుల్లోనే వాటిని పెద్ద ఎత్తున పురుగుల మందు పిచికారి చేసి సంహరించాలని కేసీఆర్ పేర్కొన్నారు. కరోనా లాగా ఇదో కొత్తరకమైన సమస్య. ఈ మధ్య కాలంలో మిడతల దండుతో మనకు పెద్దగా ఇబ్బందులు రాలేదు. అందువల్ల ముందుగా మితల దండు దాడి చేస్తే ఆయా పంట పొలాలు ఉన్న రైతులకు నష్టపరిహారం ఇచ్చేలా చూడాలి. దీనికి కేంద్రం ముందుకు రావాలి. ఏటా పంటల బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించడంలో వారిని ప్రీమియం చెల్లించేలా ప్రోత్సహించడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవు తున్నారు. దీంతో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వారికి పరిహారం అందడం లేదు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్తితి ఉంది. ఈ దశలో మిడతల దండు దాడిని కూడా ప్రకృతి విపత్తుగానే చూడాలి. పంటకు పూర్తిస్థాయి పరిహారం వచ్చేలా చేయాలి. ఏటా పంటల బీమా చేయించడంలో రైతులను చైతన్యం చేయించి వారితో నామమాత్రంగా బీమా సొమ్ము చెల్లించేలా చేయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. ప్రదానంగా బీమా పథకాల వల్ల కలిగే లబ్దిపై వారికి సమాచారం ఉండడం లేదు. అలాగే ఏ పంటకు ఎంత చెల్లించాలన్న సమాచారం కూడా రైతులకు చేరడం లేదు. అలాగే పథకాల అమలుపై రైతుల్లో చైతన్యం కానరావడం లేదు. వడగళ్లు,విలయం సంభవించినప్పుడు ప్రభుత్వాలపై ఆధారపడి పరిహారం అందక లబోదిబోమంటున్నారు. దీనిని తప్పించేం దుకు ఫసల్ బీమా వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులను చైతన్యం చేయక పోవడం వల్ల ఆశించిన స్థాయిలో బీమాకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. ఈ దశలో మిడతల దండులా ంటి ఉపద్రవాలు సంభవిస్తే ఇక రైతులు కోలుకో వడం కష్టం. అందువల్ల పంటల బీమాలో మితల దాడిని కూడా చేర్చాలి. ఇప్పటికే ఉన్న బీమా పథకంలో క్షేత్ర స్థాయిలో అధికారులు తగిన రీతిలో రైతులకు సమాచారాన్ని చేరవేయఎ ేవడంతోనే బీమాకు దూరమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అతివృష్టి, అనావృష్టి, వడగండ్లు, ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే రైతులను ఆదుకోవడంలో బీమా పథకం ప్రధానపాత్ర పోషిస్తోంది. అందులో మిడతల దాడిని కూడా చేర్చి నామమాత్రం ప్రీమియంతో రైతులను గట్టెక్కించే ఆలోచన చేయాలి. పంటల వారీగా ప్రీమియం ధరలు, చెల్లించాల్సిన గడువు తేదీల వివరాలతో కూడిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేస్తే బాగుంటుంది. పంట రుణం తీసుకునే రైతులు, రుణం అవసరం లేని రైతులు ఈ బీమా పథకాలను వినియోగించుకునేలా చేయాలి. అయితే పంట రుణాలను పొందాలనుకున్న రైతులకు సంబంధించి రుణం అందజేసే సమయంలోనే ప్రీమియాన్ని తీసుకుని మిగతా మొత్తాన్ని సదరు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. రుణాలు పొందని రైతులు నేరుగా బ్యాంకులు, మీసేవ కేంద్రాల ద్వారా బీమా ఏజెన్సీ ప్రతినిధులకు బీమా బీమా ప్రీమియం చెల్లించవచ్చు. పంట నష్టం జరిగితే పరిహారం రావాలంటే నిర్ణీత గడువులో బీమా చెల్లించాలి. ఈ విషయంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి ప్రతి రైతు ప్రీమియం చెల్లించేలా కృషి చేయాలి. అప్పుడే పంటలకు తగిన భరోసా దక్కుతుంది. మిర్చి, పత్తి, శనగ తదితర రైతులు నష్టం సంభవించినప్పుడు ఏ విధంగా పరిహారం పొంద వచ్చో గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు చేయాలి. ప్రతి పంటకు అన్నిరకాలుగా పరిహారం దక్కేలా విస్తృత బీమా పథకం ప్రవేశ పెడితే మంచిది.

రాజ్యసభ సెక్రటేరియట్ అధికారికి కరోనా

రెండు అంతస్తులు మూసివేత

మహారాష్ట్రను వీడని కరోన కలకలం

న్యూఢిల్లీ,మే29(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలోని రాజ్యసభ సెక్రటేరియేట్‌లో పనిచేస్తున్న ఓ డైరక్టర్‌కు కరోనా పాజిటివ్ తేలింది. దీంతో పార్లమెంట్ బిల్డింగ్‌లోని రెండు అంతస్తులను సీజ్ చేశారు. ఆఫీసర్‌తో పాటు ఆయన భార్య, పిల్లలకు కూడా కరోనా పాజిటివ్ సోకినట్లు తేలింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ హౌజ్‌లోని ఫస్ట్ ఫ్లోర్‌ను శానిటైజ్ చేసి సీల్ చేశారు. అయితే ఆ ఆఫీసర్‌తో టచ్‌లోకి వచ్చిన ప్రతి ఒక అధికారి, వ్యక్తిగత సిబ్బంది కూడా తమ ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని అధికారులు ఆదేశించారు. మరోవైపు గత 24 గంటల్లో భారత్‌లో 7466 కొత్త పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. దేశంలో కరోనాకు కేంద్ర బిందువుగా మహారాష్ట్ర మారింది. అత్యధిక కేసులు అక్కడే నమోదవుతున్నాయి. రాష్ట్రంలో ప్రజలతోపాటు అంతే మొత్తంలో పోలీసులు కూడా కరోనా వైరస్ బారినపడుతున్నారు. రాష్ట్రంలో ఒక్క రోజులోనే 116 మంది పోలీసులు కరోనా పాజిటివ్‌లుగా తేలగా, ముగ్గురు మరణించారు. దీంతో మహారాష్ట్రలో కరోనా బారిన పడిన పోలీసుల సంఖ్య 2,211కి పెరిగింది. రాష్ట్రంలో ఇప్పటివరకు పోలీస్ శాఖలో 25 మంది ఈ ప్రాణాంతక వైరస్‌తో మృతిచెందారు.

మిడతల దండును అడ్డుకునేలా సన్నద్ధం

సరిహద్దుల్లో పరిస్థితిని అధ్యయనం చేస్తున్న కమిటీ

న్యూఢిల్లీ,మే29(ఆర్ఎన్ఎ): మిడతల దండు దాడి నేపథ్యంలో ప్పటికే మహారాష్ట్ర, చత్తీష్‌గడ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని జిల్లాల కలెక్టర్లను, పోలీసు అధికారులను తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఈ చర్యల్లో భాగంగా ఫైర్ ఇంజన్లను, జెట్టింగ్ మిషన్లను, పెస్టిసైడ్లను సిద్ధంగా పెట్టినట్లు చెప్పారు. మిడతల దండు కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, రాష్ట్రంలో ప్రవేశించకుండా పర్యవేక్షించేందుకు అయిదుగురు సభ్యుల కమిటీని నియమించింది. ఈ కమిటీ మిడతల దండు ప్రయాణాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి, అవి రాకుండా అడ్డుకునే చర్యలను పర్యవేక్షిస్తుంది. ఇందుకోసం సిఐపిఎం ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ ఆర్. సునిత, వ్యవసాయ యూనివర్సిటీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్. జె. రహమాన్, వరంగల్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ అక్బర్, రామగుండం పోలీస్ కమిషనర్ సత్యనారాయణ, మంచిర్యాల కలెక్టర్ భారతిలతో ఈ కమిటీలను ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీలు శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు రామగుండంలోనే మకాం వేస్తుంది. హెలికాప్టర్ ద్వారా ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు గోదావరి వెంట పరిస్థితిని గమనిస్తూ ఉంటారు. మిడతల దండు రాష్ట్ర సరిహద్దుల్లోకి వస్తే వాటిని సంహరించే చర్యలను పర్యవేక్షిస్తారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులను అప్

ఎండలతో బెజవాడ జనం ఉక్కిరిబిక్కిరి

విజయవాడలో కానరాని పచ్చదనం

విజయవాడ,మే29(ఆర్ఎన్ఎ): వేసవి తాపం నుంచి ప్రధానంగా జనాన్ని కాపాడేది.. కాస్త నీడ మాత్రమే. విజయవాడలోని బందరు, ఏలూరు ప్రధాన రోడ్లు, జాతీయ రహదారి పక్కన ఎక్కడా ఒక్క చలువపందిరి వేసింది లేదు. దీంతో.. జనం ఎక్కడా నిలబడేందుకు సైతం కాస్త నీడ ప్రాంతం లేకపోవడంతో విలవిలలాడి పోతున్నారు. లాక్‌డౌన్ తరవాత ఇప్పుడిప్పుడుఏ బయటకు వస్తున్న జనాలకు ఎండ తీవ్రత చుర్రుమనిపిస్తోంది. గతంలో జాతీయ రహదారి పక్కన ఉండే చెట్ల కింద కూర్చుని సేదదీరేవాళ్లు. ప్రస్తుతం వాటన్నింటినీ కొట్టేయడంతో.. పనుల కోసం వచ్చేవాళు , యాచకులు, చిరువ్యాపారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతోంది. రహదారుల పొడవునా.. అక్కడక్కడా ఎండకు తాళలేక ప్రజలు నీడకోసం పరుగిడుతున్నారు. ఇంక నగరంలోని ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద పరిస్థితి.. అత్యంత దారుణంగా ఉంటోంది. వాహనం రెండు మూడు నిమిషాలు ఆపితే.. ఎండ వేడికి వాహనదారులు డంగై పోతున్నారు. ఎండల నుంచి ప్రజలను కాపాడేందుకు.. అన్ని రకాల చర్యలూ చేపడుతున్నామంటూ ప్రకటించిన అధికారులు వాస్తవంగా చూస్తే.. కనీస ఏర్పాట్లూ చేయడం లేదు. ప్రధానంగా విజయవాడలో కనీసం చలువ పందిళ్లు సైతం.. రహదారుల పక్కన ఏర్పాటు చేయలేదు. గుంటూరులో కొన్ని ప్రాంతాల్లో గతేడాది అధికారులు చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. కానీ.. విజయవాడ నగరంలో ఎక్కడా ఒక్క చలువ పందిరి వేసిన దాఖలాలు లేవు. కనీసం బెంజిసర్కిల్, రమేష్ ఆసుపత్రి జంక్షన్, రామవరప్పాడు, పోలీస్ కంట్రోల్‌రూం వద్ద ఉండే.. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్దయినా.. రోడ్డుకు అటునుంచి ఇటు.. పందిళ్లు లాంటివి ఏర్పాటు చేస్తే.. వాహనదారులకు కాస్త ఉపశమనం లభిస్తుంది. గత నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. వచ్చే ఐదు రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉండబోతున్నాయని వాతావరణ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. అందుకే.. ఇప్పటికైనా అధికారులు బయటకొచ్చే జనాలను రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా రహదారులకు ఇరువైపులా చలువ పందిళ్లు, ఎక్కడికక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, వోఆర్ఎస్ ప్యాకెట్లను పుష్కలంగా విజయవాడ నగరంలోని కనీసం ఓ 20ప్రాంతాల్లోనైనా అందరికీ కనిపించేలా అందుబాటులో ఉంచడం చేయాలి. రహదారుల పక్కన అందుబాటులో లేకపోవడంతో వేడి నుంచి ఉపశమనం కోసం.. శీతలపానీయాలపై ఆధారపడుతూ.. మరింత అనారోగ్యాల పాలవుతున్నారు. ఉచిత మంచినీటి వేసవి శిబిరాలను సైతం పెద్దఎత్తున ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలి. ఎండలు.. వచ్చే ఐదు రోజుల్లో తీవ్రంగా ఉండడంతో పాటూ.. ఎలాగూ.. జూన్ రెండో వారం వరకూ ఉంటాయి. కనీసం.. అధికారులు ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే అనేక నగరాల్లో.. ఇలా చేస్తున్నారు. ఆకుపచ్చని గుడ్డలను ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనదారులు వేచిఉండే ప్రాంతాలకు పైన పందిళ్లలా కడుతున్నారు. జనం బయటకు రావొద్దంటూ.. ప్రకటనలు విడుదల చేస్తున్నారు. కానీ.. వస్తున్న వారిని రక్షించేందుకు ఏం చేస్తున్నారనేది ఆలోచించే నాథుడే లేడు. ఎండనుండి కాపాడేందుకు.. జనానికి ఏం అవసరమనేది గుర్తించి చేసే పరిస్థితిలేదు. విజయవాడ నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం. అత్యవసర పనులపై వచ్చేవాళ్లు.. ఎండవేడికి విలవిలలాడుతూ.. ఎక్కడికక్కడ కూలబడిపోతున్నారు.

చంద్రబాబుది మహానాడు కాదు

మాయనాడు అన్న మంత్రి వెల్లంపల్లి

విజయవాడ,మే29(ఆర్ఎన్ఎ): చంద్రబాబుది మహానాడు కాదు.. మాయనాడు అని దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. చంద్రబాబు పాలఅన అంతా అవినీతిమయమన్నారు. విద్య,వైద్య రంగాలను పూర్తిగా దెబ్బతీసారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను తుంగలో తొక్కిన ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ఎన్నికల మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి టీడీపీ తొలగించిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏడాది కాలంలోనే 90శాతం హామీలను నెరవేర్చారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తన మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ లా భావిస్తుందన్నారు. పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ ఒక వరమని.. పేదలందరికీ వైద్యం అందించాలన్నదే సీఎం జగన్ ధ్యేయమని మంత్రి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, ఇతర రాష్ట్రాల్లో కూడా హెల్త్‌కార్డులు వినియోగించుకునేలా వైఎస్ జగన్ సంకల్పించారని తెలిపారు. గత ఐదేళ్ల టీడీపీ పాలనలో పేదల ఆరోగ్యంపై చంద్రబాబు అనేక స్కామ్‌లకు పాల్పడ్డారని మంత్రి విమర్శలు గుప్పించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగాన్ని సీఎం జగన్ పూర్తి ప్రక్షాళన చేశారని వెల్లంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

మరో 15రోజులు లాక్‌డౌన్ పొడిగించాలి

కేంద్రాన్ని కోరిన గోవా సిఎం సావంత్

పనాజీ,మే29(ఆర్ఎన్ఎ): నాలుగో విడత లాక్‌డౌన్ గడువు మే 31తో ముగియనున్న నేపథ్యంలో మరో 15 రోజులు లాక్‌డౌన్‌ను పొడిగించాలని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఫోన్‌లో మాట్లాడి తన అభిప్రాయం వెల్లడించినట్లు చెప్పారు. అయితే, అదే సమయంలో లాక్‌డౌన్ నిబంధనలు పాటిస్తూ, 50 శాతం కెపాసిటీతో రెస్టారెంట్లను తెరుచుకునేందుకు ఐదో విడత లాక్‌డౌన్ సడలింపులు ఇవ్వాలని హోంమంత్రిని కోరినట్లు సావంత్ తెలిపారు. అదేవిధంగా జిమ్‌లను తెరుచుకునేందుకు అనుమతి ఇవ్వాలని కూడా చాలా మంది నుంచి వినతులు వస్తున్నాయని గోవా ముఖ్యమంత్రి చెప్పారు. దేశంలో నాలుగు విడతలుగా లాక్‌డౌన్ విధించినా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్నదే తప్ప తగ్గడంలేదని, అందుకే మరో 15 రోజులపాటు లాక్‌డౌన్‌ను పొడిగించాలని తాను కేంద్ర హోంమంత్రిని కోరానని గోవా సీఎం సావంత్ చెప్పారు.

50మంది మందుబాబుల లైసెన్సులు రద్దు

కరీంనగర్, మే 29(నేటినిజం ప్రతినిధి)మద్యంసేవించి వాహనాలు నడిపిన కేసుల్లో ఈమధ్యకాలంలో పట్టుబడిన 50మందికి సంబంధించిన వారి లైసెన్సులను గురువారంనాడు రవాణాశాఖ అధికారులు ఉత్తర్వులను జారీచేశారు. ఈమేరకు లైసెన్సులు రద్దుకాబడిన వారికి సమాచారం అందించడంతోపాటు వారి ఒరిజనల్ డ్రైవింగ్ లైసెన్సులను స్వాధీనం చేసుకుంటున్నామని కరీంనగర్ ట్రాఫిక్ ఏసిపి శంకర్‌రాజు తెలిపారు.వివరాలు ఇలాఉన్నాయి.ఈమధ్యకాలంలో మద్యంసేవించి పట్టుబడిన వారిలైసెన్సులను రద్దుచేయాలని కోరుతూ కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆదేశాలమేరకు రవాణాశాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపామని ఇందులో 50మంది లైసెన్సులను 06నెలల నుండి ఒకసంవత్సరంపాటు రద్దుచేస్తున్నట్లుగా రవాణాశాఖ అధికారులు ఆదేశాలను జారీచేశారని తెలిపారు. గురువారం నాడు లైసెన్సులు రద్దుఅయిన వారిలో కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన డోలి వినిచందర్, చింతకుంటకు చెందిన ఓడ్నాల వెంకటేశం, అక్కన్నపేటకు చెందిన బండారి సారయ్య, బొమ్మకల్‌కు చెందిన గర్వందుల కిరణ్‌కుమార్, కరీంనగర్‌కు చెందిన బెజ్జూరి అఖిల్, కల్లెడకు చెందిన గడ్డం సదానందం, రేణికుంటకు చెందిన కొల్ముారి రమేష్, భగత్‌నగర్‌కు చెందిన కోరేళ్ళం అభిలాష్, రేవెళ్ళి వీరయ్య, సుభాష్‌నగర్‌కు చెందిన లింగంపల్లి యుగేందర్, కరీంనగర్‌కు చెందిన కర్ణే అశోక్, వల్లంపహాడ్‌కు చెందిన కుదేల్లి తిరుపతి,ఎలగందల్‌కు చెందిన హనుమాండ్ల రాజేందర్, రేకుర్తికి చెందిన పున్నం మల్లయ్య, కరీంనగర్‌కు చెందిన సయ్యద్ ఇస్మాయిల్, విద్యానగర్‌కు చెందిన జంగం రమేష్, వడుకాపూర్‌కు చెందిన రేచవేని అనీల్, దేవంపల్లికి చెందిన సంపత్, హుస్నాబాద్‌కు చెందిన గగులోత్ జమి, కరీంనగర్‌కు చెందిన సంబోజు అనీల్‌కుమార్,కోతిరాంపూర్‌నకు చెందిన మహమ్మద్ హకీమ్, కరీంనగర్‌కు చెందిన సిరికొండ రమేష్, జమ్మికుంటకు చెందిన పెగడపల్లికి చెందిన సత్తయ్య, ఆర్నకొండకు చెందిన గంటల అశోక్, కరీంనగర్‌కు చెందిన సిరికొండ రాంకుమార్, మంకమ్మతోటకు చెందిన నగునూరి ప్రభాకర్, కరీంనగర్‌కు చెందిన మొగిలి శ్రీనివాస్, వెనబల్ల వెంకటరమణ, అడవిశ్రీరాంపూర్‌కు చెందిన పల్లెవేన సదానందం, భగత్‌నగర్‌కు చెందిన పున్న ప్రణయ్‌కుమార్, రామడుగుకు చెందిన వేముల అనీల్, ముకరంపురాకు చెందిన ముమ్మడి నరసింహాచారి, ప్రగతినగర్‌కు చెందిన కొమ్ముల శంకరయ్య,ఈదులగట్టెపల్లికి చెందిన మీసా రాజేంద్రప్రసాద్, గంగిపల్లికి చెందిన గంగిపల్లి సంపత్, వెలిచాలకు చెందిన బండపల్లి గంగస్వామి, శ్రీరాములపల్లికి చెందిన సంటి జితేందర్, గణేష్‌నగర్‌కు చెందిన జంగాలపల్లి అరవింద్, కరీంనగర్‌కు చెందిన బి అరవింద్‌కుమార్, మొంగవాని రాకేష్, తిమ్మాపూర్‌కు చెందిన బత్తుల నారాయణ, కరీంనగర్‌కు చెందిన కరీంనగర్‌కు చెందిన గసికొండ మల్లేష్, ఎలగందలకు చెందిన మహమ్మద్ గౌస్, కోరెంకు చెందిన ఎలుకల చంద్రారెడ్డి, కరీంనగర్‌కు చెందిన చెక్కిళ్ళ నరేష్, రాంనగర్‌కు చెందిన పుల్లూరి రమేష్‌లకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్సులను 06నెలల నుండి ఒకసంవత్సరంపాటు రద్దుచేశారు. రవాణాశాఖకు పంపిన మరికొన్ని ప్రతిపాదనలు లైసెన్సుల రద్దుకోసం పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

అరికెల నర్సారెడ్డిని పరామర్శించిన మాజీ ఎంపీ కవిత

మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి తల్లి మరణించడంతో ఆయనను పరామర్శించిన మాజీ ఎంపి కవిత

నిజామాబాద్, మే 29: మాజీ ఎమ్మెల్సీ, టీఆర్ఎస్ నేత అరికెల నర్సారెడ్డి తల్లి మృతిపై మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత సంతాపం వ్యక్తం చేశారు.

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం బాడ్సిలోని నర్సారెడ్డి నివాసంలో వారి కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

నర్సారెడ్డి తల్లి గంగమ్మ ఇటీవల మరణించారు. మాజీ ఎంపీతో పాటు, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, జాజాల సురేందర్, ఎమ్మెల్సీ వీజీ గౌడ్, టీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి పాల్గొన్నారు.

ఫెడరల్ ఫ్రంట్ దిశగా మరోమారు కెసిఆర్ ఆలోచన?

రాష్ట్రాల సిఎంలతో కెసిఆర్ చర్చించే చాన్స్
కరోనాతో అన్ని రాష్ట్రాల సిఎంల్లోనూ మోడీపై అసంతృప్తి

హైదరాబాద్,మే29(ఆర్ఎన్ఎ): కరోనాలుగో దశ కూడా ముగిసిపోతున్న దశలో కేంద్రం తీరుపై సిఎం కెసిఆర్ గుర్రుగానే ఉన్నారు. నేరుగా రాష్ట్రాలకుఎలాంటి సాయం చేయకపోవడంపై ఆగ్రహంతో ఉన్నారు. కేంద్రంతో సఖ్యంగా ఉన్నా లభం లేదన్న విషయాన్ని గమనంలోకి తీసుకుని రానున్న రోజుల్లో రాజకీయంగా వ్యూహం సిద్ధం చేసే అవకాశం ఉంది. కరోనాతో ప్రజలకు నేరుగా సాయం అందకపోవడంతో దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని మరోమారు జాతీయ రాజకీయాలపై కెసిఆర్ దృష్టి సారించే అవకాశాలను పరిశీలించే పరిస్థితులు ఉన్నారు. ఇప్పటికే జాతీయ రాజకీయాలపై దృష్టి సారించిన సిఎం కెసిఆర్ ఇప్పుడు వేగంగా పావులు కదుపుతున్నారు. ఫెడరల్ ఫ్రంట్ దిశగా ముందడుగు వేశారు. భావసారూప్య పార్టీలను కలుపుకుని పోవడం ద్వారా రాష్ట్రాలను బలోపేతం చేసేలా రాజకీయ వ్యూహం పన్నారు. బిజెపి, కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా బలమైన ఫ్రంటం ఏర్పడాలన్న ఆకాంక్షను కెసిఆర్ బలంగా తీసుకుని వెళ్ళేందుకు అవసరమైన పునాది ఇప్పటికే పడింది. ఇందులో భాగంగా కేరళ, తమిళనాడు,బెంగాల్,ఒడిషా, ఢిల్లీ పర్యటనలకు శ్రీకారం చుట్టారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ముందే ఆయా పార్టీలను మానసికంగా సిద్ధం చేసే క్రమంలో ఆయా రాష్ట్రాల సిఎంలతో మాట్లాడారు.దేశంలో ఇప్పటివరకు కాంగ్రెస్, బీజేపీ మాత్రమే అధికారంలో ఉన్నాయని, రెండు పార్టీలు కూడా రాష్ట్రాల అవసరాలను, అభ్యంతరాలను పట్టించుకోని వైనాన్ని కెసిఆర్ పదేపదే చెబుతున్నారు. కరోనా సమయంలోనూ బిజెపి రాష్ట్రాల అభిప్రాయాలకు విలువనీయలేదు. రాష్ట్రాలపై పెత్తనం చేసేందుకే.. కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్న భావన అన్ని రాష్ట్రాల సిఎంల మనోగతంగా ఉంది. అందుకే ఈ దుష్ట సంప్రదాయాన్ని పరిహరించేలా.. రాష్ట్రాల గొంతుకును సమిష్టిగా వినిపిద్దామని సీఎం కేసీఆర్..ఏడాది క్రితమే రంగంఓలకి దిగారు. వామపక్షాలు కూడా ఫ్రంట్‌లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఆయా నేతల అభిప్రాయాలు తెలుసుకుంటే కేంద్రంలో అడుగు ఎలా వేయాలన్న స్పష్టత కూడా ఉంది. అందుకే కెసిఆర్ వ్యూహాత్మకంగా నేతల మనోగతాన్ని ఇప్పటికే తెలుసుకున్నారు. వారితో నర్మగర్భంగా చర్చించారు.

దేశ రాజ్యాంగ మూల సూత్రాలకు భిన్నంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ముందునుంచి కేసీఆర్ ఆగ్రహంగా ఉన్నారు. భవిష్యత్తులో మళ్లీ కాంగ్రెస్ లేదా బీజేపీల్లో ఏది అధికారంలోకి వచ్చినా.. రాష్ట్రాలపై ఇప్పుడున్న వివక్ష కొనసాగుతుందని, మార్పు ఉండదని బలంగా వాదిస్తున్నారు. అందుకే రాష్ట్రాల హక్కులను కాపాడుకోవడంతో పాటు, రాష్ట్రాలే బలంగా నిలబడేలా చేస్తే ఫెడరల్ స్ఫూర్తి కొనసాగు తుందని భావిస్తున్నారు. అందుకే తాను ఉద్దేశించిన ఫెడరల్ ఫ్రంట్ అత్యంత అవసరమన్న

వివరించారు. కేంద్ర, రాష్ట్రాల జాబితాలతోపాటు ఉమ్మడి జాబితాలోని అంశాలపై క్షుణ్ణంగా చర్చ జరగాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రచారంలో కూడా ఇదే వైఖరిని ప్రకటించారు.

సార్వత్రిక ఎన్నికలకు ముందు ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, డీఎంకే అధినేత స్టాలిన్, కర్ణాటక సీఎం కుమారస్వామి, పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ తదితర నేతలతో సీఎం కేసీఆర్ భేటీ అయి.. కాంగ్రెసేతర, బీజేపీ యేతర ఫ్రంట్ ఏర్పాటుపై చర్చించారు. ప్రజలే కేంద్రంగా పరిపాలన జరగాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షిస్తున్నారు. ఇందులో భాగంగా దేశంలోని ప్రాంతీయ పార్టీల నేతృత్వంలో దేశంలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు కావాలన్న లక్ష్యంతో ఎన్నికలకు ముందు పలు రాష్ట్రాల్లో పర్యటించి ఆయా పార్టీల నాయకులతో, ముఖ్యమంత్రులతో భేటీ అయ్యారు. దేశవ్యాప్తంగా ఎన్నికలు పూర్తయిన తరువాత మరోసారి అన్ని రాష్ట్రాలు తిరిగి అందరితో చర్చిస్తామని సీఎం కేసీఆర్ ఇదివరకే చెప్పారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కేంద్రం వైకరి ఏమిటో కెసిఆర్ గ్రహించారు. ఈ అనుభవం విపక్షాల సిఎంలందరికి ఉంది. దీంతో మరోమారు కేంద్రానికి వ్యతిరేకంగా రంగంలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా కెసిఆర్ ఫ్రంట్‌కు ఏ మేరకు ఆదరణ లభిస్తుందన్నది చూడాలి. కెసిఆర్ ప్రతిపాదనలతో ఎంతమంది ముందుకు వస్తారన్నది కూడా చూడాలి. మోడీపట్ల తీవ్ర వ్యతిరేక పాదుకున్న కారణంగా విపక్షాలతో పాటు, ప్రజల్లో కూడా సానుకూలత లభించగలదని భావిస్తున్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

వైద్యఖర్చు రూ. వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ
సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు
విద్య,వైద్య రంగాలను విస్మరించిన గత ప్రభుత్వం
ఏడాదిగా అమలు చేసిన సంస్కరణలపై సీఎం జగన్ సమీక్ష

అమరావతి,మే29(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కోటి 42లక్షల కుటుంబాలను ఆరోగ్యశ్రీ పథకంలోకి తీసుకొచ్చా మని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం విద్యావైద్య రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. అందుకే తాము ఈ రెండురంగాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వైఎస్ ఉండగా ఆదరణకు నోచుకున్న ఈ రెండు రంగాలను మళ్లీ ఆదరిస్తున్నామని చెప్పారు.

నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వాస్పత్రుల్లో మార్పులు తెస్తున్నామని చెప్పారు. వైద్య ఆరోగ్య రంగంలో ఏడాదిగా అమలు చేసిన సంస్కరణల పై సీఎం సమీక్షించారు. 2వేలకు పైగా జబ్బులకు ఆరోగ్యశ్రీ, వర్తిస్తున్నది. వైద్యఖర్చు రూ. వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తిస్తుంది. క్యాన్సర్ రోగులకు ఆరోగ్యశ్రీ వర్తింపు. జులై 8వ తేదీ నుంచి మరో 6 జిల్లాల్లో అమలు చేస్తాం. మిగిలిన 6 జిల్లాల్లో దీపావళి, నవంబర్ 14 నుంచి అమలు చేస్తాం. ఇప్పటికే పశ్చిమ గోదావరి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు అమలు చేస్తున్నాం. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు పొందవచ్చు. పీహెచ్‌సీల రూపురేఖలను మార్చబోతున్నాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి పెన్షన్లు అందిస్తున్నామని సీఎం వివరించారు. ఈ ఏడాదికాలంలో ఆరోగ్య రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదవాడికి విద్య, వైద్యం అందుబాటులో ఉండాలనే నిర్ణయాలు తీసుకున్నారని, ఆయన మరణం తర్వాత ఆ రెండూ పేదవాడికి దూరమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 90శాతం నెరవేర్చామని చెప్పా రు. మన పాలన-మీ సూచన కార్యక్రమం లో భాగంగా శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ, ఆసుపత్రుల్లో నాడు- నేడుపై తాడేపల్లిలోని క్యాంపు ఆఫీస్‌లో సీఎం వైఎస్ జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ, 104.. 108ల ఆధునికీకరణ, వాహనాల సంఖ్య పెంపుపై ఆయన1 చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి వర్తిం పజేశాం. 1.42 కోట్ల మందిని ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చాం. 2 వేల జబ్బులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెస్తా.. జులై 8 నుంచి మరో 6 జిల్లాలో అమలు చేస్తాం. నవంబర్ 8 నుంచి మిగిలి న జిల్లాల్లో కూడా అమలు చేస్తాం. క్యాన్సర్ రోగాన్ని కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చాం. స్పీచ్ థెరపీని కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చాం. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల కోసం.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో కూడా ఆరోగ్యశ్రీని అమలు చేస్తున్నాం. నెట్‌వర్క్ ఆస్పత్రులకు గత ప్రభుత్వం పెట్టిన ఆరోగ్యశ్రీ బకాయిలను కూడా చెల్లించామని పేర్కొన్నారు.

నెట్‌వర్క్ ఆస్పత్రులకు గ్రేడింగ్

నెట్‌వర్క్ ఆస్పత్రులకు గ్రేడింగ్ ఇచ్చామని, బి గ్రేడ్‌లో ఉన్న ఆస్పత్రులు 6 నెలల్లో అన్ని వసతులు సమకూర్చుకోవాల్సి ఉందన్నారు. 9 రకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి పింఛన్ 3వేల నుంచి 10 వేలకు పెంచాం. 1.33 లక్షల మందికి క్యూఆర్ కోడ్ కలిగిన ఆరోగ్యశ్రీ కార్డులిచ్చాం. మరో రెండువారాల్లో మిగిలినవారికి కూడా ఆరోగ్యశ్రీ కార్డులిస్తాం. ప్రభుత్వాస్పత్రుల్లో ఇచ్చే మందుల సంఖ్యను 230 నుంచి 500లకు పెంచామని జగన్ వివరించారు. మందులను కూడా డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలకు అనుగుణంగా అందిస్తున్నాం. ప్రభుత్వా స్పత్రికి ధైర్యంగా వెళ్లేలా ఆధునికీకరిస్తున్నాం. 70 లక్షల మంది విద్యార్థులకు కంటివెలుగు పరీక్షలు నిర్వహించాం. లక్షా 29వేల విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశాం. రాబోయే రోజుల్లో 46వేల మంది విద్యా ర్థులకు శస్త్ర చికిత్సలు చేయిస్తాం. రెండో విడతలో అవ్వా, తాతలకు కంటి పరీక్షలు నిర్వహిస్తాం. దివ్యాంగులు సదర్ సర్టిఫికెట్ కోసం గతంలో అనేక ఇబ్బందులు ఎదు ర్కొనేవారు.. ఇప్పుడు వెంటనే సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని వివరించారు.

ఆస్పత్రుల రూపురేఖలు మార్చేలా 'నాడు-నేడు'

ఆస్పత్రుల రూపురేఖలు మార్చేలా 'నాడు-నేడు' చేపట్టాం. కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వాస్పత్రులను ఆధునీకరిస్తున్నాం. కొత్తగా మరో 16 టీచింగ్ ఆస్పత్రులతోపాటు... ఐటీడీఏ పరిధిలో 7 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నాం. గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. 24 గంటలు వైద్యసహాయం అందుబాటులో ఉండేలా విలేజ్ క్లినిక్‌లు. రూ.2,600 కోట్లతో విలేజ్, వార్డు క్లినిక్‌లు. రూ.671 కోట్లతో పీహెచ్‌సీలను కూడా ఆధునీకరిస్తున్నాం. జులై 1 నుంచి 1060 కొత్త 104, 108 అంబులెన్స్‌లను ప్రారంభిస్తాం. ఆరోగ్య సమస్యలపై 14410పై టెలీమెడిసిన్‌ను అందుబాటులోకి తెచ్చాం. వైద్యులు సూచించే మందులను కూడా డోర్‌డెలివరీ చేసేలా చర్యలు. ఇంటివద్దకే వైద్యం అందించేలా ప్రతి పీహెచ్‌సీకి ఒక బైక్‌ను అందుబాటులో ఉంచుతాం. 9,712 మంది వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందిని కొత్తగా నియమిస్తున్నట్లు వెల్లడించారు.

కరోనా నియంత్రణ చర్యల్లో ఏపీ అగ్రస్థానం

కరోనా కట్టడికి యుద్ధప్రాతిపదికన అడుగులు వేశాం. 70 రోజుల్లోనే 13 జిల్లాల్లో ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చామని సిఎం అన్నారు. రోజుకు 11వేల పరీక్షలు నిర్వహించే సామర్థ్యాన్ని పెంచుకున్నాం. మిలియన్‌కు 6,627 పరీక్షలు చేస్తూ.. దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నాం. దేశంలో పాజిటివిటీ రేటు 4.71శాతం కాగా.. ఏపీలో 0.97 మాత్రమే. దేశంలో రికవరి రేటు 42.75 శాతం కాగా.. ఏపీలో 65.49 శాతం. దేశంలో మరణాల రేటు 2.86 శాతం కాగా.. ఏపీలో 1.82 శాతం. కరోనా నియం త్రణ చర్యల్లో దేశంలోనే మనం అగ్రస్థాన ంలో ఉన్నాం. కరోనా రోగులను వివక్షతతో చూడాల్సిన అవసరం లేదు. ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. రాష్ట్రస్థాయిలో 5 కోవిడ్ ఆస్పత్రులను ఏర్పాటు చేశాం. 65 జిల్లాస్థాయి ఆస్పత్రులను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు.

త్వరితగతిన వరంగల్ పట్టణ అభివృద్ధి పనులు

వరంగల్ అర్బన్, మే 29: వరంగల్ పట్టణాభివృద్ధి పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసి నగర వాసులకు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హన్మకొండ బస్టాండ్ జంక్షన్ అభివృద్ధి పనులను వరంగల్ మున్సిపల్ కమిషనర్ పమేలా సత్పతి, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డిలతో కలిసి భూమి పూజ చేశారు. కోటి 90 లక్షల రూపాయలతో చేపట్టనున్నఈ అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. గతంలో పట్టణంలో వర్షపు నీరు రోడ్ల మీద నిలిచి రహదారులు గుంతలతో నిండి ఇబ్బందికరంగా ఉండేదన్నారు. నేడు టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే హన్మకొండ పట్టణంలో ఉన్నఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని వినయ్ భాస్కర్ తెలిపారు.

హైకోర్టులో జగన్ సర్కార్‌కు గట్టి ఎదురుదెబ్బ

ఎన్నికల కమిషనర్‌గా నిమ్మగడ్డ కొనసాగాల్సిందే అని తీర్పు

నిమమగడ్డను తొలగిస్తూ ఇచ్చిన జివోల కొట్టివేత

అమరావతి,మే29(ఆర్ఎన్ఎ): ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు మరో షాక్ ఇచ్చింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నిమ్మగడ్డ రమేశ్ కుమార్‌ను కొనసాగించాల్సిందేనని ఉన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఆయనను తొలగిస్తూ జగన్ సర్కార్ ఇచ్చిన ఆర్డినెన్స్‌ను హైకోర్టు కొట్టేసింది. అలాగే

త్వరితగతిన వరంగల్ పట్టణ అభివృద్ధి పనులు

వరంగల్ అర్బన్, మే 29: వరంగల్ పట్టణాభివృద్ధి పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసి నగర వాసులకు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హన్మకొండ బస్టాండ్ జంక్షన్ అభివృద్ధి పనులను వరంగల్ మున్సిపల్ కమిషనర్ పమేలా సత్పతి, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డిలతో కలిసి భూమి పూజ చేశారు.

కోటి 90 లక్షల రూపాయలతో చేపట్టనున్నఈ అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. గతంలో పట్టణంలో వర్షపు నీరు రోడ్ల మీద నిలిచి రహదారులు గుంతలతో నిండి ఇబ్బందికరంగా ఉండేదన్నారు. నేడు టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే హన్మకొండ పట్టణంలో ఉన్నఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని వినయ్ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో కుడా ప్లానింగ్ ఆఫీసర్ అజిత్ రెడ్డి, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశంలో తమ 12 సంవత్సరాల ప్రయాణాన్ని వేడుక చేస్తున్న ఆంపియర్ ఎలక్ట్రిక్

బెంగళూరు, మే29ః గ్రీవ్స్ కాటన్‌కు పూర్తి అనుబంధ సంస్థ అయిన ఆంపియర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ , స్థిరంగా రవాణా పరిష్కారాలను అందించడంలో 12 వసంతాలను పూర్తి చేసుకోవడాన్ని వేడుక చేస్తుంది. ఈ 12వ వార్షికోత్సవంలో భాగంగా, కంపెనీ 5వేల రూపాయల వరకూ రాయితీలతో పాటుగా ఇతర ప్రయోజనాలను ఆంపియర్ ఈ?స్కూటర్లపై వినియోగదారులకు అందిస్తుంది. అంతేకాదు, ఈ అదనపు ప్రయోజనాలలో హై స్పీడ్ మోడల్స్‌పై 5 సంవత్సరాల వరకూ విస్తరించిన వారెంటీ మరియు ఇతర వేరియంట్లపై మూడు సంవత్సరాల వారెంటీని నామమాత్రపు ధరలో అందిస్తుంది. వీటితో పాటుగా వినియోగదారులు ఆకర్షణీయమైన ధరలో 1+5 సంవత్సరాల బంపర్ టు బంపర్ వాహన భీమాను సైతం పొందవచ్చు.

ఈ పథకం, పర్యావరణాన్ని కాపాడటం పట్ల వినియోగదారులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రారంభించిన 'కల్ కో బచావో' అనే ఆంపియర్ యొక్క పర్యావరణ అనుకూల మద్దతు ప్రచారాన్ని అనుసరిస్తుంది. ఆంపియర్ ఈ?స్కూటర్లపై ఆకర్షణీయమైన రాయితీలతో పాటుగా కస్టమైజ్డ్ ఈఎంఐ అవకాశాలను సైతం దీనిలో భాగంగా అందించనున్నారు. ఈ ఆఫర్ మన కరోనా వారియర్లు అయిన డాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, నిత్యావసర సేవలలో ఉన్నటువంటి ఇతర వ్యక్తులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, వ్యాపారులు మరియు సూక్ష్మ వ్యాపారవేత్తలు పర్యావరణ అనుకూల, అతి తక్కువ నిర్వహణ మరియు తేలికపాటి ఆంపియర్ ఎలక్ట్రిక్ స్కూటర్లను తమ తుది మైలు కనెక్టివిటీ కోసం వినియోగించవచ్చు. కోవిడ్ మహమ్మారితో ఆరోగ్యం మరియు సంక్షేమం కాపాడుకోవడం అత్యంత ఆవశ్యకమైంది మరియు ఆంపియర్ ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇప్పుడు వినూత్నమైన విలువ ప్రతిపాదనతో పర్యావరణ స్పృహ కలిగిన బీ2సీ మరియు బీ2బీ వినియోగదారుల గ్రూప్‌లకు మద్దతునందించడానికి సిద్ధంగా ఉంది.

కోవిడ్ బారిన పడకుండా ఉండేందుకు గుంపులుగా ఉండే ప్రజా రవాణాను నిరోధించడంతో పాటుగా వ్యక్తిగత రవాణాను వినియోగించాల్సిన అవసరం ప్రజలకు పెరిగింది. ఆంపియర్ స్కూటర్లపై ఈ అసాధారణ ఆఫర్‌ను సంభావ్య ద్విచక్ర వాహన కొనుగోలుదారులకు అందిస్తారు. తమ అత్యవసర కొనుగోలుపై అతి తక్కువ చెల్లింపులు చేయాలనుకునే వారికి ఇది ఉపయుక్తంగా ఉంటుంది. భారతదేశంలో అత్యంతవేగంగా వృద్ధి చెందుతున్న ఈవీ బ్రాండ్‌లలో ఒకటి ఆంపియర్ ఎలక్ట్రిక్. ఇది సంప్రదాయ పెట్రోల్ స్కూటర్‌లతో పోలిస్తే 85?90% నిర్వహణ ఖర్చులను ఆదా చేసే రీతిలో విస్తృత శ్రేణి ఉత్పత్తులను అందిస్తుంది. ఆంపియర్ వినియోగదారులు తమ స్కూటర్ల జీవితకాలంలో అత్యధిక మొత్తంలో నగదును పొదుపు చేయవచ్చు. చిన్న పట్టణాలు మరియు గ్రామీణ మారుమూల ప్రాంతాలలో మొత్తం కుటుంబ అవసరాలను ఒక ఆంపియర్ ఈ?స్కూటర్ తీరుస్తుంది. షాప్ ట్రిప్స్‌తో పాటుగా తమ రోజువారీ కార్యకలాపాల నిర్వహణకు వారు వినియోగించుకోవచ్చు.

స్థిరమైన మరియు అందుబాటు ధరలలో రవాణా పరిష్కారాలను సృష్టించడాన్ని యాంపియర్ నమ్ముతుంది. ఇవి అత్యున్నత చోధక అనుభవాలను మరియు అత్యధిక పనితీరును అందిస్తుంది. 60వేల మందికి పైగా సంతోషకరమైన వినియోగదారులు మరియు భారతదేశ వ్యాప్తంగా 200కు పైగా డీలర్లు కలిగిన ఆంపియర్, దేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విద్యుత్ ద్విచక్ర వాహన బ్రాండ్లలో ఒకటి. ఈ నూతన ఆఫర్లతో, మేము మరింతగా ప్రాప్యతను పెంపొందించడంతో పాటుగా ప్రజలను విద్యుత్ రవాణాకు ఓ అడుగు దగ్గరగా తీసుకురానున్నారు.

జూన్1 నుంచి 8 వరకు పట్టణ ప్రగతి

మేడ్చల్ మే 29:రాష్ట్రంలోనే మేడ్చల్ జిల్లాను పట్టణ ప్రగతిలో ప్రథమ స్థానంలో నిలుపాలని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అధికారులకు సూచించారు. గురువారం జిల్లాలోని 4 కార్పొరేషన్లు, 9మున్సిపాలిటీల్లో నిర్వహించే పట్టణప్రగతిపై మేయర్లు, డిప్యూటీమేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లతో మంత్రి మల్లారెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జూన్1 నుంచి 8 వరకు పట్టణప్రగతి కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.గతంలో మిగిలిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటగా డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, పార్కులు, చెరువులు, కుంటలను అందంగా తీర్చిదిద్దడంతో పాటు మొక్కలను నాటాలన్నారు.కాలనీల్లో తాగునీరు,విద్యుత్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కమిషనర్లను ఆదేశించారు.

లాక్‌డౌన్ సమయం లో నిరుపేదలకు బియ్యం,నగదు పంపిణీలో కీలకపాత్ర పోషించిన అధికారులు, కమిషనర్లను మంత్రి అభినందించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో తప్పనిసరిగా షీ-టాయిలెట్లను ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ప్రతి ఆదివారం 10గంటల 10 నిమిషాల పాటు మురికివాడల్లో సీజనల్ వ్యాధుల నివారణ కోసం పరిసరాలను పరిశుభ్రం చేసి, స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు.

వలస కార్మికుల తరలింపునకు 279 రైళ్లు నడిపాం: ఛైర్మన్

న్యూఢిల్లీ,మే29(ఆర్ఎన్ఎ): వలస కార్మికులను తరలించేందుకు ఈనెల 20వ తేదీ వరకు 279 శ్రామిక్ రైళ్లు నడిపినట్లు రైల్వే బోర్డు చైర్మన్ వినోద్ కుమార్ యాదవ్ తెలిపారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాల చేసిన విజ్ఞప్తులకు తగినట్లు రైళ్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు సగటున మూడు లక్షల మంది వలస కార్మికులను తరలిస్తున్నట్లు చైర్మన్ వీకే యాదవ్ తెలిపారు. మొత్తం 3840 రైళ్లలో కేవలం నాలుగు రైళ్లు మాత్రమే గమ్యాన్ని చేరేందుకు 72 గంటల కన్నా ఎక్కువ ప్రయాణ సమయం తీసుకున్నాయన్నారు. 90 శాతం రైళ్లు.. సగటు వేగం కన్నా ఎక్కువ వేగంతోనే నడిచాయన్నారు. వలస కార్మికుల్లో.. సుమారు 42 శాతం ఉత్తరప్రదేశ్‌కు, 37 శాతం మందిని బీహార్‌కు తరలించినట్లు ఆయన చెప్పారు. రైళ్లు స్టార్ట్ అయిన స్టేషన్ల వద్ద స్థానిక రాష్ట్ర ప్రభుత్వాలే ఆహారం, నీరు ఏర్పాటు చేసినట్లు రైల్వే బోర్డు చైర్మన్ తెలిపారు. ఇక రైలు కదులుతున్న సమయంలో.. ఐఆర్‌సీటీసీ, రైల్వే డివిజన్లు.. భోజనం, నీరు అందించినట్లు ఆయన చెప్పారు. గర్భిణులు, పదేళ్లలోపు చిన్నారులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులు, పలు రకాల వ్యాధులు ఉన్నవారు.. అత్యవసరం అయితే తప్ప.. రైలు ప్రయాణం చేయరాదు అని ఆయన సూచించారు.

భూగర్భ జలాలు పెంచేలా చర్యలు

నారింజ ప్రాజెక్ట్ పూడికతీత పనులకు ఎంపి ప్రారంభం

సంగారెడ్డి,మే29(నేటినిజం ప్రతినిధి): ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టి భూగర్భ జలాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నదని,అందులో భాగంగానే నారింజ ప్రాజెక్టు గేట్ల మరమ్మతులతో పాటు పూడికతీత పనులు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ తెలిపారు. జహీరాబాద్ మండలంలోని కొత్తూరు గ్రామంలోని నారింజ ప్రాజెక్టులో ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఎమ్మెల్యే మాణిక్యరావు, డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్ తో కలిసి పూడికతీత పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నారింజ ప్రాజెక్టు గేట్లు, తూములు మరమ్మతులు చేయడంతో పాటు పూడిక తీసి నీళ్లు నిలువ చేసేందుకు పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నారింజ ప్రాజెక్టు లో నీటిమట్టం పెరిగేతే జహీరాబాద్ లో పుష్కలంగా నీళ్లు ఉంటాయన్నారు. రైతులకు ఉచితంగా పూడికతీత మట్టి అందిస్తామని, వారు ట్రాక్టర్లు తీసుకురావాలన్నారు. పూడికతీత మట్టితో నేల సారవంతమై పంటలు బాగా పండుతాయన్నారు.

పోతిరెడ్డిపాడు జీవోను రద్దు చేయాలి

నిధుల ఎత్తిపోతలకే కెసిఆర్ ప్రాజెక్టులు: కోమటిరెడ్డి

నల్గొండ,మే29(ఆర్ఎన్ఎ): పోతిరెడ్డి పాడు విస్తరణకోసం ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో. 203ను తక్షణం రద్దుచేయాలని కాంగ్రెస్ ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం తీసుకున్ననిర్ణయం తెలంగాణకు నష్టం కలిగిస్తుందన్నారు. పట్టణంలోని మామిళ్ల గూడెంలో కరోనా వ్యాధితో చనిపోయిన కానిస్టేబుల్ దయాకర్‌రెడ్డికుటుంబాన్ని ఆయన పరామర్శించారు. దయాకర్‌రెడ్డి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంతో నాగార్జున సాగర్‌కు చుక్కనీరు రాదన్నారు. వైఎస్ జగన్‌తో కలిసిన కేసీఆర్ దక్షణ తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దక్షణ తెలంగాణను ఎడారి చేయడమే లక్ష్యంగా కేసీఆర్ కుట్ర చేస్తున్నారని అన్నారు. కమిషన్ల కోసమే గోదావరి నీళ్లను కష్టాలో కలుపు తామంటున్నారని ఆరోపించారు. కొండపోచమ్మ ప్రాజెక్టుతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఏడారిగా మారుతుందన్నారు. గందమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లను పక్కనబెట్టారని అందుకే కాంగ్రెస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు ప్రభుత్వం పై పోరాటానికి మేం సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జూన్ 2 న ప్రాజెక్టుల వద్ద ధర్నాలను విజయవంతం చేయాలని కోమటిరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా అందరూ ఈ పోరాటంలో కలిసి రావాలన్నారు. ఎస్సెల్బీసీ సొరంగ మార్గానికి వెయ్యికోట్లు ఇస్తే పూర్తయ్యేదన్నారు నిధులు కేసీఆర్ కుటుంబానికి, నీళ్లు అంధ్ర ప్రాంతానికి పోతున్నాయని అన్నారు. పోతిరెడ్డి పాడు ఇష్యాను పక్కదోవ పట్టించేందుకు కొండపోచమ్మ సబురాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. కొండ పోచమ్మ ద్వారా కూడా ఒక్క ఎకరానికీ కూడా నీరు ఇవ్వలేదన్నారు.

దేశ రాజధాని ఢిల్లీలో కొత్తగా 82 కరోనా మరణాలు

-కేసుల సంఖ్య పెరగడంపై ప్రజల్లో ఆందోళన

న్యూఢిల్లీ,మే29(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో కొత్తగా 82 కోవిడ్ మరణాలు సంభవించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా శుక్రవారంనాడు తెలిపారు. గురువారం వరకూ 82 మరణాలు కొత్తగా వచ్చి చేరారు. వీటిలో 13 మంది గత 24 గంటల్లో మృతి చెందారు. తక్కిన 69 మరణాలు గత 34 రోజుల్లో చోటుచేసుకున్నాయి. ఈ మరణాలనన్నీ క్రోడీకరించి ధ్రువీకరించుకున్నాం అని సిసోడియా తెలిపారు.

ఇంతవరకూ 17,386 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్టు ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యేంద్ర జైన్ తెలిపారు. వీరిలో 1,106 కేసులు కరోనా పాజిటివ్‌గా గురువారంనాడు నిర్ధారణ అయినట్టు చెప్పారు. మొత్తం 7,846 మంది పేషెంట్లకు స్వస్థత చేకూరగా, మృతుల సంఖ్య 398కి చేరినట్టు సత్యేంద్ర జైన్ వివరించారు. వివిధ ఆస్పత్రులు ఆలస్యంగా నివేదించడం వల్ల, అనంపూర్తిగా సమాచారం సమర్పించడం వల్ల ఈ కేసులు ఇప్పుడు నమోదవుతున్నాయని సిసోడియా చెప్పారు. 69 మరణాలలో సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో జరిగిన 52 మరణాలు ఉన్నాయి, ఈ నివేదికను కొన్ని రోజుల క్రితం అధికారులు సమర్పించారు. డెత్ ఆడిట్ కమిటీ ఈ కేసులన్నింటినీ పరిశీలించి గణాంకాలను ఇచ్చింది. కాబట్టి ఈ 82 పెరుగుదల ఒకేసారి కనిపించిందని సిసోడియా చెప్పారు. ఢిల్లీలో కోవిడ్ -19 కారణంగా మరణించిన వారి సంఖ్య 398 కు పెరిగిందని జైన్ తెలిపారు. మే 12-20 మధ్య వ్యవధిలో ప్రతి రోజు ఒక మరణం జరిగింది. తాజాగా 1,106 కరోనావైరస్ కేసులు నమోదయ్యాయి, ఢిల్లీలో మొత్తం 17,000 కు పైగా కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీరిలో 7,846 మంది కరోనా భారి నుంచి కోలుకున్నారని ఆయన అన్నారు. ఢిల్లీలో ఒకే రోజులో 1000 కి పైగా కొత్త కరోనా కేసులు నమోదవుతున్నాయి. అంతకుముందు అత్యధికంగా 1,024 తాజా కేసులు మే 28 న నమోదయ్యాయి, కొత్తగా మరో 1,106 కేసులతో, మొత్తం సంఖ్య 17,387 కు చేరుకుంది. ఢిల్లీలో ప్రస్తుతం ఆసుపత్రులలో 21,000 పడకలు, ప్రైవేట్‌లో 1,400, ప్రభుత్వ ఆసుపత్రులలో 3,700 పడకలు అందుబాటులో ఉన్నాయని జైన్ చెప్పారు. ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది కాబట్టి ప్రజలు భయపడవద్దని సిసోడియా విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ రోజుల ట్వీట్ చేస్తూ, మీరు కరోనా సంక్రమించినట్లయితే ప్రజలు భయపడవద్దని, మీలో చాలా మందికి ఇంటి వద్దనే చికిత్స చేయవచ్చు, అయినప్పటికీ మీరు ఆసుపత్రిలో చేరాలంటే దీనికి పూర్తి సన్నాహాలు జరుగుతున్నాయి, మీ మంచి ఆరోగ్యం, ఆనందం కోసం నేను దేవుడిని ప్రార్థిస్తున్నానని, కరోనా రోగులు, లక్షణాలు ఉన్నవారు తమ ఇంటి వద్దనే చికిత్స ద్వారా కోలుకోవచ్చు, వారు ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేదని ట్వీట్ చేశారు. వైరస్ లక్షణాలు ఉంటే తప్ప ప్రజలు ఆసుపత్రులను సందర్శించాల్సిన అవసరం లేదని సిసోడియా విలేకరుల సమావేశంలో అన్నారు, ఇంటి వద్ద చికిత్స తీసుకుంటున్న వారిలో 80-90 శాతం రికవరీ నమోదైందని తెలిపారు.

మండుటెండలకు కూరగాయల ధరలు పైపైకి

భూగర్భ జలాలు అడుగంటడంతో తగ్గిన దిగుబడులు

హైదరాబాద్,మే29(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ పాక్షిక ఎత్తివేతతో మళ్లీ ప్రజలు రోడ్డెక్కారు. యధావిధిగా తమ పనుల్లో పడుతున్నారు. హోటళ్లు టేక్ అవే ప్రారంభించారు. ఇప్పటికే చికెన్ రేట్లు అదరగొడుతున్నాయి. మండు వేసవి మరింత వేడెక్కి ఎండలు భగభగమండుతున్నాయి.. ఉదయం 10గంటల నుంచి వడగాల్పులు వీస్తున్నాయి. పది నిమిషాలు రోడ్డుపై తిరిగితే నడినెత్తి చుర్రుమంటోంది. నాలుక తడారిపోతోంది.. మనిషి పరిస్థితి ఇలా ఉంటే..ఇక జంతువులు చెట్టూ చేమా పరిస్థితి చెప్పాల్సి లేదు. మార్కెట్లలో కూరగాయల ధరలు ఎండల తీరుగానే భగ్గుమంటున్నాయి. పంటల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు మెల్లగా పెరుగుతున్నాయి. మొన్నటి వరకు టమాటాలు పది లోపే కిలో ఉండగా ఇప్పుడు మెల్లగా 15 దాటింది. ఇక మిగతా కూరగాయలు కూడా కిలో 50-60 మధ్య పలుకు తున్నాయి. వ్యాపారులను అడిగితే పంట తగ్గిపోయిందని చెబుతున్నారు. ఒక పక్క ఎండ సెగ..మరో పక్క కూరగాయల ధరల మంట చూసి నగరవాసులు ఉసూరుమనాల్సి వస్తోంది.. ఎండల తీవ్రత కూరగాయల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. కూరగాయలు పండించే రైతులకు నీరందక వందలాది ఎకరాల్లో పంట ఎండిపోయి దిగుబడి తగ్గిపోయింది. కరోనాతో పంటలపైనా దృష్టి పెట్టలేకపోయారు. కూలీల కొరతతో పంటలను పొలాల్లోనే వదిలేశారు. ఫలితంగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. నిత్యం వాడే ఉల్లి ధరలు మళ్లీ 20పైనే పలుకుతన్నాయి. ఎండాకాలంలో పంటల విస్తీర్ణం పరిమితమైంది. దిగుబడి కూడా సగానికి తగ్గి ఉత్పత్తి పడిపోయింది. దీంతో నగరానికిరావాల్సిన కూరగాయల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిందని అంటున్నారు. వేసవి ప్రభావం తీవ్రంగా ఉండటంతో భూమిలోని తేమ గంటల వ్యవధిలో ఆవిరవడంతో పంటలకు నీరు అందని పరిస్థితి. ఏర్పడుతోంది. భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోవడంతో బోర్లు ఉన్నా పనిచేయడం లేదు. ఎండ తీవ్రతకు,వడ గాలులకు వచ్చిన పూత కూడా రాలిపోవడంతో కాయలుకాయడం లేదని అంటున్నారు. అన్ని కూరగాయల ధరలు దాదాపు ఇదే తీరులో పెరిగాయి. టమోటా, బీర, గోరు చిక్కుడు సాగు చేసిన రైతులు అప్పు చేసి పెట్టుబడి పెట్టారు. తీరా ఇప్పుడిప్పుడే కాపు మొదలైందనుకున్న దశలో ఎండలకు ఉన్న పంట కాస్తా చేతికందకుండా పోతోంది. ఎండ తీవ్రత కారణంగా పంట ఎండిపోయిది. పెట్టుబడి కూడా చేతికి వస్తుందన్న నమ్మకం లేదని కూరగాయల రైతులు వాపోతున్నారు. ఎండల తీవ్రత ఇదే స్థాయిలో ఉండి, వర్షాలు పడకపోతే భూగర్భ జలాలు మరింత తగ్గిపోయి పంటలు ఎండిపోతాయి. ఇప్పటికే 80 శాతం కూరగాయల పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయి. దిగుబడి ఇంకా పడిపోయి మార్కెట్‌కు కూరగాయలు రావడం కష్టమయ్యే పరిస్థితులు నెలకొని ఉన్నాయని నగర మార్కెట్లకు సరఫరా చేస్తున్న వ్యాపారులు అంటున్నారు. ఇలాగే ఎండలు కొనసాగితే ధరలు మరింతగా మండే ప్రమాదం కనిపిస్తోంది.

వికారాబాద్ నియోజకవర్గంలోని గొట్టి ముక్కుల గ్రామంలో జరిగిన రైతు నివేదిక సభలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రా రెడ్డి

సిఎం కేసీఆర్ రైతు పక్షపాతి

అందుకే వారి కోసిం నిరంతర తపన నియంత్రిత పంటలతో లాభాలుగ గడించాలన్న సబిత

వికారాబాద్,మే29(ఆర్ఎన్ఎ): స్వతహాగా రైతు అయిన సీఎం కెసిఆర్ ..రైతు పక్షపాతి అని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నిరంతరం అన్నదాతల సంక్షేమం కోసమే పరితపిస్తారని వి అన్నారు. నియంత్రిత పంటల సాగు పై వికారాబాద్ నియోజకవర్గంలోని గొట్టి ముక్కుల గ్రామంలో జరిగిన రైతు నివేదిక సభలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతుకు సాగునీరు, విద్యుత్, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తే రైతుకష్టాలు దూరం అయినట్లే అని భావించి ముఖ్యమంత్రి ఆ దిశ గా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తో అపర భగీరథ ప్రయత్నం సీఎం కేసీఆర్, మన ప్రాంతానికి సాగు నీరు తీసుకువచ్చేందుకు అవిరళ కృషి చేస్తున్నారని తెలిపారు.రైతు పండించిన పంటకు రైతే ధర నిర్ణయించి స్థాయికి చేరుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. అలాగే రైతులు సంప్రదాయ సాగుకు భిన్నంగా పంటమార్పిడి తో అధిక దిగుబడి సాధించొచ్చని మంత్రి సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు మారాలి. మార్కెట్ డిమాండ్ కు అనుంగుణంగా పంటలు పండించి లాభాలు గడించాలన్నారు. చిరు ధాన్యాలు కొర్రలు, రాగులు తదితర వాటికి నగరాల్లో బాగా డిమాండ్ ఉంది. ఆ దిశగా వాటితో పాటు తెలంగాణ సోనాకు కూడా మన ప్రాంతం లో మంచి అవకాశం ఉన్నందున ఆ పంటల పై రైతులు దృష్టి సారించాలన్నారు. రైతులు సమిష్టిగా చర్చించుకోవటానికి రైతు వేదికల నిర్మాణం చేస్తున్నట్లు వెల్లడించారు. దేశం మొత్తం మీద తెలంగాణ పత్తికి మంచి గుర్తింపు, డిమాండ్ ఉందని మంత్రి పేర్కొన్నారు. కంది పంట కూడా ప్రభుత్వం రైతు దగ్గరకు వచ్చి కొంటున్నది. జిల్లా కందికి దేశంలోనే మంచి డిమాండ్ ఉన్నందున వాటి సాగును పెంచాలన్నారు. పంట మార్పిడిని ప్రభుత్వం చెప్పినట్లు వేసుకుని, రైతు రాజుగా మారాలన్నారు. ఇదిలా వుంటే రంగారెడ్డి డిజిల్లాలోని శంకరపల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య అవసరాలకై కొనుగోలు చేసిన ట్రాక్టర్లను మంత్రి ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మె ల్యే కాలే యాదయ్య, శంకరపల్లి మున్సిపల్ చైర్పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో నియంత్రిత సాగు విధానంపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు.

కరోనా కట్టడిలో పోలీసుల పాత్ర కీలకం

నిర్మల్, మే 29: కరోనా వైరస్ ను అరికట్టడంలో పోలీసులు ముందు వరసలో ఉంటారన్నారని ఎస్పీ శశిధర్ రాజు అన్నారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు జిల్లా సాయుధ దళం కార్యాలయ ఆవరణలో ఉచిత మెడికల్ క్యాంప్ ను ఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీమాట్లాడుతూ జిల్లాలో వైద్యులు, పారిశుధ్య సిబ్బంది తదితర అధికారుల సమన్వయంతో వైరస్ వ్యాప్తిని పూర్తిగా అరికట్టామన్నారు. అందుకు ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించి భౌతిక దూరం పాటించాలని సూచించారు. రోగ నిరోధక శక్తిం పెంపొందించుకునేందుకు ఇప్పటికే హైడ్రాక్సీ క్లోరోక్విన్ మాత్రలు, ఎనర్జీ డ్రింక్స్ దాతల సహాయంతో తరచూ పంపిణీ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

భారత్, చైనా సరిహద్దు సమస్యల్లో ఇతరుల జోక్యం అనవసరం

అమెరికా అధ్యక్షుడి ట్రంప్ ఉత్సాహంపై డ్రాగన్ ఝులక్ చైనా తీరుపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి

న్యూఢిల్లీ,మే29(ఆర్ఎన్ఎ): చైనా,భారత్‌ల మధ్య ఉన్న సరిహద్దు సమస్యలపై మరో దేశం ప్రమేయాన్ని అంగీకరించేది లేదంటూ డ్రాగన్ అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ ట్రంప్‌కు ఝులక్ ఇచ్చింది. భారత్ - చైనా మధ్య తలెత్తిన సరిహద్దు సమస్యలో మూడో పక్షం జోక్యం అనవసరమని తేల్చి చెప్పింది. భారత్- చైనా మధ్య తలెత్తిన సరిహద్దు సమస్యకు మధ్యవర్తిత్వానికి రెడీగా ఉన్నానని ట్రంప్ ప్రకటనపై ప్రశ్నించగా చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి జావో లిజియన్ పై విధంగా తేల్చి చెప్పారు. చైనా,భారత్ మధ్య తలెత్తిన సరిహద్దు సంబంధ వివాదాల పరిష్కార మార్గాలున్నాయి. చర్చల మార్గాలు కూడా ఉన్నాయి. చర్చల ద్వారా, సంప్రదింపుల ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకునే సత్తా మాకుంది. మూడోపక్షం జోక్యం అనవసరం అని జావో లిజియన్ స్పష్టం చేశారు. భారత్-చైనా మధ్య నెలకొన్న సరిహద్దు వివాదం నేపథ్యంలో.. ఇరుదేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించాలని అమెరికా భావిస్తోందని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఈ మధ్యవర్తిత్వం వహించే సత్తా అమెరికాకు ఉందని, అలా చేయడానికి సిద్ధంగా కూడా ఉన్నామని ట్రంప్ చెప్పారు. కాగా, భారత్-చైనా సరిహద్దులో పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి వెల్లడించిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే భారత్, చైనా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. భారత్, చైనా మధ్య పెను సమస్య ఏర్పడిందని, దీని గురించి ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడినట్లు ట్రంప్ తెలిపారు. వైట్‌హౌజ్‌లోని ఓవెల్ ఆఫీసులో ఆయన ఈ అంశంపై మీడియాతో మాట్లాడారు. భారత్, చైనా మధ్య తీవ్ర అగాధం ఏర్పడిన విషయం మీకు తెలిసిందే అన్నారు. భారతీయులు తనను ఇష్టపడుతారని, మా దేశ మీడియా కన్నా భారతప్రజలే నన్ను ఎక్కువ ఇష్టప డుతారని, మోదీని నేను లైక్ చేస్తానని, ఆయ న్ను ఎంతో అభిమానిస్తాను అని, ఆయనో గొ